

పేస్ కాలేజీ వద్ద బారులుతీరిన అభ్యర్థులు

సజావుగా గ్రూప్-2 పరీక్ష



చంటిబిడ్డతో క్విస్ కాలేజీ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థి

గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఆదివారం ఒంగోలులో సజావుగా సాగింది. చంటి పిల్లలతో వచ్చిన తల్లులు, తల్లిదండ్రులతో వచ్చిన యువతీ యువకులు, సహాయకులతో వచ్చిన విభిన్నప్రతిభావంతులు పరీక్ష కేంద్రాల వద్దకు సమయానికన్నా ముందే చేరుకున్నారు. రెండు పరీక్ష కేంద్రాల వద్ద ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించకపోవడంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు. కలెక్టర్ అన్సారియా మూడు సెంటర్లను పరిశీలించారు.

7



రైజ్ కాలేజీ వద్దకు చేరుతున్న అభ్యర్థులు



అభ్యర్థిని చెక్‌చేస్తున్న పోలీస్



అదిగో నీ నంబర్ అంటూ



పరుగో పరుగు



'క్విస్'లో కలెక్టర్ పరిశీలన



'పేస్' వద్ద పరీక్ష గది(?) చూసుకుంటూ...



ఆలస్యమవడంతో... విలపిస్తూ..



తండ్రి ఆప్యాయత



ఆలస్యమవడంతో బతిమాలినా రానీయక...

జిల్లాలోని అన్న క్యాంటీన్‌లలో అందిస్తున్న ఆహారం, అక్కడి పరిశుభ్రతపై ప్రజానీకం పూర్తి సంతృప్తితో ఉంది. ఆర్టీసీ సేవల విషయంలో కూడా సానుకూలత వ్యక్తమవుతోంది. మద్యం దుకాణాల నిర్వహణపై మాత్రం తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. రేషన్ పంపిణీ, ప్రభుత్వ వైద్యసేవలు, భూముల సర్వే, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభిప్రాయ సేకరణలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ముఖ్యమంత్రి కార్యాలయ పర్యవేక్షణలో ఒక ప్రత్యేక విభాగం వారానికి ఒకసారి చొప్పున నెలకు నాలుగు పర్యాయాలు వివిధ విభాగాలకు సంబంధించి సర్వే నిర్వహించి జిల్లాలకు ర్యాంకులు ప్రకటిస్తోంది. అందులో అనేక విభాగాలు ప్రజల విశ్వాసం పొందడంలో వెనుకబడ్డాయి. వివరాలను జిల్లా యంత్రాంగానికి పంపించి తగు చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది.



ఒంగోలులోని కర్నూలు రోడ్డు పవర్‌ఆఫీసు వద్ద అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న పేదలు



ఒంగోలులోని మద్యం దుకాణం

ప్రభుత్వ సర్వేలో జిల్లా ప్రజల అభిప్రాయం

ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్, వాట్సాప్‌ల ద్వారా సేకరణ

భూ సర్వే, వైద్యం, రేషన్ పంపిణీపై అసంతృప్తి

ఆర్టీసీ సేవల విషయంలో సంతృప్తి

జిల్లా యంత్రాంగానికి అంశాల వారీ సర్వే రిపోర్టులు

తగు చర్యలకు ఆదేశం

కొంతే నయం!

అన్న క్యాంటీన్‌లు బెస్ట్.. మద్యం షాపులు వరస్ట్!

ఒంగోలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుడ్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. అందులో నిరంతరం ఆయా అంశాలపై ప్రజాభిప్రాయాలను సాంకేతికత ఆధారంగా సేకరించి వారి నుంచి వ్యక్తమైన అభిప్రాయాలకు అనుగుణంగా పరిపాలన మెరుగునకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ముఖ్యమంత్రి కార్యాలయ పర్యవేక్షణలో ప్రత్యేక విభాగం పనిచేస్తోంది. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, పౌర సేవలకు సంబంధించిన అంశాలపై ప్రతి వారం నాలుగైదు అంశాలపై ఈ విభాగం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేస్తున్నారు. జిల్లాల వారీగా కొందరు సిబ్బంది ప్రజలతో నేరుగా వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) ద్వారా ఫోన్‌లో మాట్లాడి కొన్ని ప్రశ్నల రూపంలో వివిధ అంశాలపై సమాచారాన్ని సేకరిస్తున్నారు. పౌరసేవలు అందించే ప్రాంతాలలో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసి దాని ద్వారా, వాట్సాప్ ద్వారా అభిప్రాయాలను తీసుకుంటున్నారు. అలా గత నెల రోజులలో వారానికి నాలుగు అంశాల వంతున ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఆయా అంశాలపై ప్రజల అభిప్రాయాలను క్రోడీకరించి జిల్లాలకు ర్యాంకులను కేటాయిస్తున్నారు. ఒక్కో అంశంలో ఏ జిల్లాలో అయితే అధిక శాతం మంది సానుకూల అభిప్రాయం వ్యక్తం చేస్తారో ఆ జిల్లాకు సంబంధిత అంశంలో ఫస్ట్ ర్యాంకును ఇస్తున్నారు. అలా 26 జిల్లాలకు 26 ర్యాంకులను ప్రకటిస్తున్నారు.

నెలలో 4 విడతలు సర్వే

నెల రోజుల్లోనే నాలుగు విడతలుగా ప్రత్యేక విభాగం సర్వే నిర్వహించింది. వాటిలో అన్న క్యాంటీన్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మద్యం దుకాణాలు, ఆర్టీసీ సేవలు, దీపం పథకం, రేషన్ పంపిణీ, భూ సర్వే, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ లాంటివి ఉన్నాయి. అందులో అన్న క్యాంటీన్‌లపై నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అదే సమయంలో మద్యం దుకాణాలపై నిర్వహించిన సర్వేలో అట్టడుగున 26వ స్థానంలో ఉంది.

ఆయా విభాగాల్లో సర్వేలో జిల్లాకు వచ్చిన ర్యాంకులు ఇలా..

- అన్న క్యాంటీన్‌లకు సంబంధించి మూడు ప్రధానాంశాల ఆధారంగా ర్యాంకు ఇచ్చారు. ఆహారం నాణ్యత, సమయపాలన, పరిశుభ్రత ప్రామాణికంగా సర్వే చేయగా రాష్ట్రంలో మన జిల్లాకు ప్రథమ ర్యాంకు లభించింది.
- బస్సు ప్రయాణాలపై ఐదు ప్రశ్నలతో సర్వే చేశారు. బస్సుల్లో పరిశుభ్రత, సిబ్బంది ప్రవర్తన, డ్రైవర్ ఎలా నడుపుతున్నారు? సకాలంలో నడుస్తున్నాయా? ప్రయాణ అనుభూతి వంటి ప్రశ్నలకు సమాధానాలు రాబట్టగా అందులో జిల్లాకు 2వ ర్యాంకు లభించింది. బస్సు స్టేషన్‌ల నిర్వహణపై జిల్లాకు 3వ ర్యాంకు వచ్చింది.
- దీపం పథకానికి సంబంధించి సిలిండర్ డెలివరీ బాయ్‌లు వాస్తవ ధర కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారా? సిలిండర్ అందిన రెండు రోజుల్లోపు సబ్సిడీ మొత్తం బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందా? అన్న ప్రశ్నలతో సర్వే చేయగా జిల్లాకు 8వ ర్యాంకు వచ్చింది.
- వైద్య విద్యలో భాగంగా నడిచే రాష్ట్రంలోని 17 జీజీహెచ్‌లపై సర్వే నిర్వహించారు. అందులో ఆయా వైద్యశాలల్లో రోజువారీ ఓపీలు, ఇన్‌పేషెంట్లు, ల్యాబ్ సర్వీసు, ఆపరేషన్లు, డెలివరీలు, ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకొన్నారు. ఒంగోలులోని జీజీహెచ్ 16వ స్థానానికి పరిమితమైంది. ప్రధాన పట్టణాలలో ఉండే ఏరియా ఆసుపత్రులకు సంబంధించి డాక్టర్ల అందుబాటు, ల్యాబ్ పరీక్షలు, ఆసుపత్రిలో సేవలపై చేసిన అభిప్రాయ సేకరణలో జిల్లా రాష్ట్రంలో 18వ స్థానంలో ఉంది.
- భూమి కొలతలపై పెద్ద సంఖ్యలో నిత్యం అధికారులకు అర్జీలు అందుతున్న నేపథ్యంలో ఎఫ్ లైన్‌గా పిలువబడే భూమి కొలతల అర్జీలు పరిష్కారంపై సర్వే చేశారు. ఈ విషయంలో అధికారులకు వస్తున్న వినతులు, వాటికి పరిష్కారం ఆధారంగా సర్వే చేయగా జిల్లా ఈ అంశంలో 24వ స్థానంలో ఉంది.
- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై నిర్వహించిన సర్వేలో జిల్లా 22వ స్థానంలో ఉంది.
- బార్లకు సంబంధించి అక్కడ విక్రయించే మద్యంలో గతంతో పోల్చితే నాణ్యత పెరిగిందా? పాపులర్ బ్రాండ్‌లు అందుబాటులో ఉన్నాయా? లాంటి కొన్ని అంశాలపై అభిప్రాయాలు సేకరించగా రాష్ట్రంలో జిల్లా 23వ స్థానంలో ఉంది. మద్యం దుకాణాలలో విక్రయించే మద్యంలో గతం కన్నా నాణ్యత పెరిగిందా? పాపులర్ బ్రాండ్‌లు అందుబాటులో ఉన్నాయా? లాంటి అంశాలపై సర్వే చేయగా జిల్లా 26వ స్థానంలో నిలిచింది.

గళం విప్పాలి.. నిధులు తేవాలి

నేటి నుంచి శాసనసభ సమావేశాలు

28న వార్షిక బడ్జెట్

ప్రభుత్వం దృష్టికి కీలక అంశాలను తీసుకెళ్లేందుకు సరైన తరుణం

అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉమ్మడిగా ప్రయత్నిస్తేనే ఫలితం

ఒంగోలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాలలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. జిల్లాలో మొత్తం 8 మంది శాసనసభ్యులు ఉండగా అందులో ఆరుగురు అధికార టీడీపీకి చెందిన వారు. మిగిలిన ఇద్దరు వైసీపీ నుంచి ఉన్నారు. కాబట్టి టీడీపీ ఎమ్మెల్యేలే జిల్లాకు సంబంధించిన తక్షణ ప్రజాసమస్యలు, అభివృద్ధి అంశాలపై గళం విప్పడంతోపాటు అవకాశం ఉన్న మేర అధిక నిధులను ఆయా రంగాలకు సాధించాల్సిన అవసరం ఉంది.



ఆందోళనలో సాగర్ ఆయకట్టు రైతులు

ఉమ్మడి జిల్లాలో కీలకమైన సమయంలో నీటి సరఫరాపై సాగర్ ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆయకట్టులో పంటలు చేతికొచ్చే దశకు చేరుకున్న సమయంలో సాగర్ నీటి సరఫరాపై నెలకొన్న గందరగోళం, రైతుల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మార్చి ఆఖరు వరకు నీటి సరఫరాకు ఢోకా లేదన్న భరోసా ఇప్పించాలి. మిర్చి, శనగ, ధాన్యం.. ఇలా పలు రకాల పంట ఉత్పత్తులు, ధరలు దిగజారాయి. ఈనేపథ్యంలో రైతులకు ఉపశమనం కల్గించేలా అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వెలిగొండ పూర్తికి నిధుల సాధన అవశ్యం

జిల్లాలో అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి నిధులు సాధించాల్సిన అవసరం ఉంది. వెలిగొండ వ్యయం తాజా అంచనాల ప్రకారం రూ.9,500 కోట్లకు చేరింది. ఇప్పటి వరకు రూ.6వేల కోట్లు ఖర్చు చేశారు. తొలిదశ పూర్తికి రూ.1,400 కోట్లు, రెండో దశకు రూ.2,100 కోట్లు అవసరం. గత వైసీపీ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో వెలిగొండకు కేవలం రూ.104 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించి అందులో నాల్గో వంతు కూడా ఖర్చు పెట్టకుండా అపహాస్యం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25లో రూ.350 కోట్లు కేటాయించి పనులను పునఃప్రారంభించింది. వెలిగొండకు 2026 జూన్‌కు నీరివ్వాలన్న లక్ష్యంతో ప్రస్తుత ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు అత్యంత ప్రధానం. రూ.2వేల కోట్లు ఆ ప్రాజెక్టుకు కేటాయించి పనులు పూర్తి చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తోంది.

శాశ్వత అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి

మార్కాపురం జిల్లా ఏర్పాటు, ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ హామీలు, ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ నిర్మాణాలు, జల్‌జీవన్ మిషన్ పథకాల మంజూరు, కనిగిరి ప్రాంతంలో ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుతోపాటు దొనకొండ కారిడార్, నిమ్జ్ వంటి శాశ్వత అభివృద్ధి పనుల్లో కదలిక తేవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉంది. ఈనేపథ్యంలో సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలలో జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, సమన్వయంతో సమైక్యంగా వ్యవహరించి సభలోపలా, బయటా ప్రభుత్వ పెద్దలవద్ద గళం వినిపించి నిధులు రాబట్టాలని ప్రజానీకం కోరుతోంది.

అనుమతిలేని వెంచర్లపై చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కనిగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో అనుమతి లేకుండా వేసిన వెంచర్లను ఆదివారం తహసీల్దార్ రవిశంకర్ పరిశీలించారు. సంబంధిత రియల్టర్లపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. 'ఆగని అక్రమ వెంచర్లు' శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పామూరు రోడ్డులోని మాజీ ఎమ్మెల్యే వ్యవసాయ క్షేత్రం వెనుక 288 సర్వే నంబరులోని వెంచర్ వద్దకు వెళ్లారు. అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేయాలని ఆదేశించారు. సెయింట్ జోసఫ్ స్కూల్ వెనుక ఉన్న సర్వే నంబరు 386లో వేస్తున్న వెంచర్‌ను కూడా నిలిపివేయాలని నిర్వాహకులకు సూచించారు. రెండు చోట్లా అపరాధ రుసుం కింద ఐదు శాతం, వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు అదనంగా మరో ఐదు శాతం జరిమానాను విధించారు. ఆ మొత్తాన్ని సోమవారం చెల్లించాలని ఆదేశించారు. అనుమతులు మంజూరైన తర్వాతనే లేఅవుట్ వేసి, ప్లాన్ అప్రూవల్ పొంది ప్లాట్లు వేయాలన్నారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కనిగిరి పెద్దచెరువు అలుగు స్థలానికి సంబంధించి పాత రికార్డులు పరిశీలించి ఆక్రమించినట్లు తేలితే రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామన్నారు. అర్బన్ కాలనీలోని 947 సర్వే నంబరులో కొంతమంది అక్రమంగా ప్లాట్లు వేయగా వాటిని రద్దు చేయడంతోపాటు వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తహసీల్దార్ రవిశంకర్ తెలిపారు. ఆయన వెంట వీఆర్వో నాగేశ్వరరావు, ప్రసాద్‌రెడ్డి, సర్వేయర్ వైష్ణవి తదితరులు ఉన్నారు.



అక్రమ వెంచర్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది



ఇంటర్ పరీక్షల నిర్వహణపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్షలు

● నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ● అధికారుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మార్చి 1 నుంచి మొదలయ్యే పరీక్షల విధుల్లో పాల్గొనే డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్‌లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, స్క్వాడ్ అధికారులకు స్థానిక ఏకేవీకే కళాశాలలో ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. పరీక్ష కేంద్రంపై చీఫ్ సూపరింటెండెంట్లకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా హాలులోకి అనుమతించవద్దన్నారు. తనిఖీలు, పరీక్షల నిర్వహణలో పక్కాగా వ్యవహరించాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. హాల్ టికెట్లపైన విద్యార్థులు చదువుతున్న కాలేజీల ప్రిన్సిపాల్స్ సంతకం కచ్చితంగా ఉండాలన్న నిబంధన ఏమీ లేదన్నారు. హాల్ టికెట్లు మంజూరు చేయాలంటే పెండింగ్‌లో ఉన్న కాలేజీ/మెస్ ఫీజు చెల్లించాలని విద్యార్థులపైన ప్రైవేటు కాలేజీలు ఒత్తిడి తెస్తే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. వాట్సాప్ ద్వారా కూడా విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్సారియా పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐవో సైమన్ విక్టర్, ఇంటర్మీడియెట్ పరీక్షల స్పెషల్ ఆఫీసర్ ఐ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

- పదేళ్లుగా సెలవు పెట్టకుండా విధులు
- ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు 150 మంది విద్యార్థుల ఎంపికకు సహకారం
- ఉత్తమ టీచర్‌గానూ పురస్కారం

7



కొప్పోలు రోడ్డు అధ్వానం



ఇందిర కాలనీ వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు

సాయిపారడైజ్ అపార్ట్‌మెంట్ వద్ద..



రైల్వే ఫ్లైవోవర్ వంతెన వద్ద

పలు చోట్ల గుంతలు

ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డు అధ్వానంగా మారుతోంది. గుంతలు ఏర్పడటంతో వాహనారులు ప్రతిరోజు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా రైల్వేఫ్లైవోవర్ వంతెన వద్ద, ఇందిరకాలనీ దగ్గర, సాయి పారడైజ్ అపార్ట్‌మెంట్ సమీపంలోని ఆర్‌అండ్‌బీ తారురోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొప్పోలులోని బ్యాంక్ వద్ద కూడా గుంతలు ఏర్పడి ఇబ్బందికరంగా మారింది. ఈ మార్గంలో ఒంగోలు మండలం, కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే వాహనదారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. రాత్రి సమయాల్లో ఈ గుంతలను గుర్తించలేని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో పలుసార్లు ప్యాచ్ వర్క్‌లు చేసినా మూణాళ్ల ముచ్చటగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

నల్ల కాలువనూ ఆక్రమించేశారు..!

● పట్టించుకోని అధికారులు

ఒంగోలు నగరంలో ఆక్రమణలపై అధికారుల ఉదాసీనత కొందరు ఆక్రమణదారులకు మరింత అవకాశంగా మారింది. గత వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా స్థలాలు ఆక్రమించగా, అనేక స్థలాలు కబ్జాదారుల చేతిలోకి వెళ్లిపోయాయి. ఇదిలా ఉంచితే ఇటీవల కాలంలో ఏకంగా నల్లకాలువను ఆక్రమించి రోడ్డు వేయడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు నుంచి వెంగముక్కలపాలెం వెళ్ళే మార్గంలోని రెండో బ్రిడ్జి వద్ద ఉన్నటువంటి నల్ల కాలువలో రోడ్డు నిర్మించినా సంబంధిత ఇరిగేషన్ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. నిన్నామొన్నటి వరకు గుడి, బడి, ఖాళీ స్థలాలు, రోడ్లు సైతం ఆక్రమణలకు గురి కాగా, తాజాగా సాగునీరు, తాగునీరు ప్రవహించే నల్లకాలువలో రోడ్డు నిర్మించడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ఆక్రమణలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వెంగముక్కలపాలెం రోడ్డులోని నల్లకాలువలో నిర్మించిన మట్టిరోడ్డు

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

ఆర్థికసాయం అందజేత



చెక్కును అందజేస్తున్న మండవ మురళీకృష్ణ

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మస్క్యులర్ డిస్ట్రోఫినూపతీ అనే అరుదైన కండరాల వ్యాధితో బాధపడుతున్న ముగ్గురు చిన్నారులకు సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఆదివారం స్థానిక కర్నూల్‌రోడ్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ నగదును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శి నియోజకవర్గం పులిపాడులో నివసించే రాఘవేంద్ర, ఎస్తేరు రాణి దంపతులకు ముగ్గురు పిల్లలు. కాగా వారు పుట్టుకతో మస్క్యులర్ డిస్ట్రోఫినూపతీ వ్యాధితో బాధపడుతుండగా తమ ట్రస్ట్‌ను ఆశ్రయించారన్నారు. దీంతో స్పందించిన ట్రస్ట్ నిర్వాహకులు ప్రవాస భారతీయుడు పోకల శ్రీనివాసులు సహకారంతో ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఛైర్మన్ షహనాజ్, సెక్రటరీ సర్దార్ బాషా పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివినప్పుడు త్వరగా నేర్చుకోగలుగుతారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అన్నారు. ఆదివారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం జాలాది మోహన్ నీతి కథలు చెప్పించారు. అదేవిధంగా చిత్రలేఖనం వేసిన వారికి డ్రాయింగ్ క్రాయన్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్.అనిల్‌బాబు, పి.ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

విద్యుత్ వృథాను పట్టించుకోరా?

● సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం..



హౌసింగ్ బోర్డు సచివాలయంలో వెలుగుతున్న లైట్లు

విద్యుత్ ఆదా చేయాలని, నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవాలని నగరపాలక సంస్థ భావిస్తుండగా, కొందరు ఉద్యోగులకు ఆ మాటలు చెవికెక్కడం లేదు. నగరంలోని డ్వామా కార్యాలయం పక్కన ఉన్న హౌసింగ్‌బోర్డు కాలనీ సచివాలయంలోని ఉద్యోగులు శనివారం లైట్లు, కంప్యూటర్లు ఆఫ్ చేయకుండా కార్యాలయానికి అలాగే తాళాలు వేసి వెళ్ళిపోయారు. దీంతో సోమవారం తిరిగి కార్యాలయం తెరుచుకోనుండగా, వాటిని పట్టించుకోకపోవడంపై స్థానికులు సిబ్బంది నిర్లక్ష్యంపై పెదవి విరుస్తున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

వైద్యరంగంలోని మార్పులపై అవగాహన పెంచుకోవాలి

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో వస్తున్న ఆధునిక మార్పులపై అవగాహన పెంచుకోవాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రోగామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని రిమ్స్ వైద్యకళాశాలలో జరిగిన డెర్మటాలజీ విభాగం జోనల్ వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుఖ వ్యాధులు, హెచ్‌ఐవీ చికిత్స, నివారణలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, విధానాలపట్ల వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. వైద్యులు నిరంతర అధ్యయనం ద్వారా మెలకువలు నేర్చుకుని రాణించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే పరిశోధనలపట్ల ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, కాటూరి మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరమ్మ, సిద్ధార్థ మెడికల్ కాలేజి ప్రొఫెసర్ ఆలిమ్స్, విశ్వభారతి వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బి.ఉదయ్‌కుమార్, రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రిమ్స్‌లో వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాసప్రసాద్

ఒంగోలులో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సేవలు విస్తృతం

● నూతన 'బి' బ్లాక్ ప్రారంభించిన మంత్రి స్వామి

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్య సేవలను విస్తృతం చేస్తూ ఒంగోలులో నూతనంగా నిర్మించిన 'బి' బ్లాక్‌ను ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఘనంగా ప్రారంభించారు. స్థానిక దక్షిణ బైపాస్ రోడ్‌లోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ పక్కనే మరో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వైద్యరంగంలో మంచి గుర్తింపు కలిగిన ఆస్టర్ రమేష్ సేవలు మరింత విస్తృతం చేయడం అభినందనీయం అన్నారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ వైద్యరంగంలో తమ 36 ఏళ్ళ విశేష ప్రయాణంలో అనేకమంది ప్రాణాలు కాపాడినట్లు చెప్పారు. 1988లో విజయవాడలో మొట్టమొదటిసారిగా కార్డియాక్ సెంటర్‌ను ప్రారంభించామని, అనేక అవార్డులు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. త్వరలోనే అమరావతిలో అత్యాధునిక క్వాటర్నరీ కేర్ హాస్పిటల్ స్థాపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఎస్పీ ఏఆర్.దామోదర్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మారిటోరియం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, నగర కమిషనర్ వెంకటేశ్వరరావులు పాల్గొని పలు వైద్య విభాగాల ప్రారంభించారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

హమాలీలకు పెంచిన కూలి ఇవ్వకుంటే సమ్మెకు సిద్ధం

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లయీస్ హమాలీలకు గత ఏడాది జనవరి నుంచి పెంచిన కూలిరేట్లతో పాటు అరియర్స్ చెల్లించకపోతే సమ్మె చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు హెచ్చరించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏపీ పౌరసరఫరాల సంస్థ హమాలీల యూనియన్ సమావేశం జిల్లా అధ్యక్షుడు బిందె ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ పెంచిన మూడు రూపాయల వేతనాన్ని కూడా ఇప్పటి వరకు చెల్లించకపోవడం దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వానికి హమాలీల పట్ల చిన్న చూపు చూస్తుందని ఆరోపించారు. ప్రతినెలా సరుకుల రవాణా మీద పెట్టే శ్రద్ధను, ఆ సరుకులు తోలే కూలీల పట్ల చూపడం లేదన్నారు. గత ఏడాది జనవరిలో కూలి రేట్లు పెంచినా ఇంతవరకు అమలు చేయకపోవడం తగదని, 14 నెలల నుంచి అరియర్స్‌కు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే కూలి రేట్లు, అరియర్స్‌ను చెల్లించాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల 24,25 తేదీల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు, మార్చి 3న మండల కేంద్రాల్లో ధర్నాలు, అప్పటికి కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే మార్చి 27న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బత్తుల గోపాలరావు, పి.కోటేశ్వరరావు, సుబ్బారావు, నాగిరెడ్డి, రంగయ్య, శ్రీను, మల్లికార్జున బాబు, ఓబులేషు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

ప్రజా ఉద్యమకారుడు తవనం చెంచయ్య



నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దిపాడు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాలకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య అని సీపీఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి అన్నారు. ఆదివారం మద్దిపాడులోని కళామందిరం వద్ద తవనం చెంచయ్య, పమిడి కోటయ్య సంతాప సభ యు.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం, అసమానతలు, పెత్తందారీతనంపై చెంచయ్య పోరాటాలు చేశారన్నారు. సాగుభూముల సాధన కోసం చెరువు నీటిపై దళితులు హక్కులు సాధించేవిధంగా కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో కనుపర్తి సుబ్బారావు, కాశీం, కాకుమాను సుబ్బారావు, చిన్నా, వెంకట్రామి రెడ్డి, బాబ్జీ, వేణు, యలమంద, గంగిశెట్టి నరసింహారావు, కటకం వెంకటేశ్వర్లు, ఈమని సుబ్బారావు, గంటా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిశ్చల భక్తి మోక్షానికి మార్గం



ప్రసంగిస్తున్న శివసుబ్రహ్మణ్యశర్మ

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నిశ్చల భక్తితోనే మోక్షం సాధ్యమవుతుందని ప్రముఖ జ్యోతిష్య, వాస్తు సిద్ధాంతి అగస్త్యరాజు శివసుబ్రహ్మణ్యశర్మ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక లాయర్‌పేటలోని శ్రీరమణ మహర్షి ప్రశాంతి కేంద్రంలో ఏర్పాటుచేసిన సత్సంగ కార్యక్రమంలో ఆయన ఈశ్వర తత్వంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గం ద్వారా మానవజన్మ సార్థకం అవుతుందని, భక్తవత్సలుడైన శివుడు తన భక్తులను ఉపద్రవాల నుంచి కాపాడుతాడని చెప్పారు. అనంతరం ప్రశాంతి కేంద్రం కమిటీ సభ్యులు శివసుబ్రహ్మణ్యశర్మను ఘనంగా సత్కరించారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం ఒకటో నంబరు ప్లాట్ ఫాంపై జరిగింది. సుమారు 60 ఏళ్ల పైబడ్డ వృద్ధుడు గళ్ళ చొక్కా, గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. మృతిని వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని రైల్వే పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని రిమ్స్‌లో భద్రపరచామని, ఆచూకీ తెలిసిన వారు 9440627647 సెల్ నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చీమకుర్తి అభివృద్ధికి బాటలు పడేనా?

● రూ.5కోట్ల డీఎంఎఫ్ నిధులతో అభివృద్ధికి ప్రతిపాదనలు

● రూ.1.5కోట్ల కోసం ఒడాకు వినతి

● నేడు మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

చీమకుర్తి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణం అభివృద్ధి వైపు వడివడిగా అడుగులేయాల్సి ఉండగా ఇంకా బుడిబుడి అడుగుల దశలోనే ఉంది. మేజర్ పంచాయతీ నుంచి నగరపంచాయతీకి, తదుపరి గ్రేడ్ 2 మున్సిపాలిటీకి హోదా పెరుగుతూ వచ్చినా అభివృద్ధిలో మాత్రం మందగమనంగానే పయనం సాగిస్తుంది. గెలాక్సీ గ్రానైట్ క్వారీల నుంచి సెస్ రూపంలో మేజర్ పంచాయతీగా ఉన్నపుడు కోట్ల రూపాయలు ఆదాయం సమకూరేది. తదుపరి పంచాయతీ నుంచి పట్టణం హోదా పొందిన తర్వాత నిబంధనల మేరకు గ్రానైట్ క్వారీలనుంచి సెస్ రూపంలో వస్తున్న కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. దీంతో మున్సిపాలిటీలో జనరల్‌ఫండ్ ఖాతాలో నిధులు లేని పరిస్థితి నెలకొంది. ఇతరత్రా ఆదాయ మార్గాలు లేక కేవలం పన్నుల రూపంలో వస్తున్న ఆదాయం మున్సిపాలిటీ నిర్వహణకే సరిపోతుంది. ఇతర అభివృద్ధి పనులు చేయటానికి నిధులు లేమి నెలకొంది. గత ఐదేళ్ల వైసీపీపాలనలో పాలకులు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా అభివృద్ధి కోసం నిధులు మంజూరులో విఫలమయ్యారు. ఉన్న జనరల్ ఫండ్ నిధులను నూతన కార్యాలయ నిర్మాణానికి ఖర్చుపెట్టటంతో పట్టణ అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్లయింది. ఈ పరిస్థితుల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావటం పట్టణవాసుల్లో కొత్త ఆశలను రేకెత్తించింది. అభివృద్ధి కాముకునిగా పేరొందిన ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తన నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏకైక మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. అయితే మున్సిపాలిటీ వైసీపీ పాలకవర్గంగా ఉండటంతో గత ఆరునెలలు పట్టణ అభివృద్ధిలో స్తబ్ధత నెలకొంది. ఈ పరిస్థితుల్లో రంగప్రవేశం చేసిన బీఎన్ పార్టీలకతీతంగా పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరటం, దానికి వైసీపీ కౌన్సిలర్లు అంగీకరించటంతో మార్గం సుగమం అయింది.

డీఎంఫ్ నిధుల మంజూరుపై దృష్టి...

గెలాక్సీ గ్రానైట్ క్వారీల నుంచి రాయల్టీతో పాటు పరిశ్రమ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ పేరిట ప్రత్యేకంగా విధించిన సెస్‌తో ఏర్పాటైంది. ప్రస్తుతం డీఎంఎఫ్ నిధులు దాదాపు రూ.80కోట్లకు పైగా ఉండటం విశేషం. దీంతో ఈ నిధులు మంజూరు చేయించుకోవటం ద్వారా చీమకుర్తి అభివృద్ధికి పాటుపడవచ్చనే ఆలోచనతో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దృష్టిసారించారు. దాదాపు రూ.5 కోట్లతో పలు పనుల ప్రతిపాదనలు చేయించి ఆమోదం కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో పాటు మరో కోటిన్నరతో పార్కు, ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టటానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఒడా)కు ప్రతిపాదనలు పంపారు. వీటికి ఆమోదం లభిస్తే చీమకుర్తి అభివృద్ధికి బాటలు పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. బడ్జెట్ పట్టణ అభివృద్ధికి పాటుపడేవిధంగా ఉంటుందని పట్టణ వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

మద్దిపాడు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై బి.శివరామయ్య కోరారు. మండల పరిధిలోని సీతారాంపురం కొష్టాలు సెంటర్, వెల్లంపల్లి చిన్న బ్రిడ్జి, రాచవారిపాలెం జంక్షన్, గ్రోత్ సెంటర్ వద్ద రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపటం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం సిబ్బందితో కలిసి ప్రధాన కూడలి వద్ద వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన వెంట ఏఎస్ఐ రమేష్‌కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు మెడికల్ స్టూడెంట్స్ యూనియన్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్యశిబిరం ఒంగోలులో నిర్వహించారు. ఆదివారం స్థానిక పీవీఆర్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో చైతన్య కార్డియాక్ సెంటర్, స్మార్ట్ విజన్, శాన్వి దంతవైద్యశాల ఆధ్వర్యంలో వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఎన్‌ఎంఎస్‌యూ నాయకులు ఎం.రామారావు, పి.జాషువా, వి.సాయి, మస్తాన్‌వలి, ఎం.జీవన్, ఇబ్రహీం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకుడు వేముల మాలకొండయ్య కోరారు. ఆదివారం ఒంగోలులోని ఆంధ్రా హైస్కూలు ఆవరణలో గ్రామీణ వైద్యుల సంఘం, మణిపాల్ హాస్పటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు సంబంధించిన పాప్స్మెర్, మామోగ్రామ్, నోటి క్యాన్సర్‌లకు సంబంధించి 62 మందికి ఉచితంగా పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బాల, దాసరి సుధాకర్, పోలవరపు సుధాకర్, రమేష్, రాజా, శ్రీను, మణిపాల్ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ సీనియర్ పురుషుల జట్టు ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుతో నిర్వాహకులు

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి హాకీ సీనియర్ పురుషుల జట్టు ఎంపికైంది. ఆదివారం ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం హైస్కూలులో జరిగిన ఎంపిక పోటీలలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరై పోటీపడ్డారు. పోటీలను జిల్లా కార్యదర్శి ఎ.సుందరరామిరెడ్డి పర్యవేక్షించగా, ప్రతిభ చాటిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన జట్టు మార్చి 7,8 తేదీలలో గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో టి.రవికుమార్, టి.రవి పాల్గొన్నారు.

క్విస్ అధ్యాపకుడికి డాక్టరేట్



చక్రవర్తిని అభినందిస్తున్న సూర్యకళ్యాణ్‌చక్రవర్తి

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న బాచిన చక్రవర్తికి అన్నామలై యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బిజినెస్ అడ్మినిస్ట్రేట్ విభాగంలో డాక్టర్ ఎన్.మాధవన్ పర్యవేక్షణలో రూరల్ మార్కెట్ అనాలసిస్ ఫర్ కార్పొరేట్ రిటైలింగ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై చక్రవర్తి సమర్పించిన నివేదకను యూనివర్శిటీ అధికారులు పీహెచ్‌డీకి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కళాశాలలో డాక్టరేట్ సాధించిన చక్రవర్తిని క్విస్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు అభినందించారు.

ప్రశాంతంగా సైంటిఫిక్ అప్టిట్యూడ్ టెస్ట్



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యనారాయణపురంలోని ఆంధ్ర హైస్కూలులో ఆదివారం 11వ రాష్ట్ర స్థాయి కలాం సైంటిఫిక్ అప్టిట్యూడ్ టెస్ట్ ప్రశాంతంగా జరిగింది. ఈ-అభ్యాస్ అకాడమీకి రాష్ట్ర వ్యాప్తంగా 275కు పైగా ఉన్న అనుబంధ పాఠశాలల్లో విద్యార్థుల కోసం గత కొన్నేళ్లుగా ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన రాష్ట్ర స్థాయి పరీక్షను పది కేంద్రాల్లో నిర్వహించగా 17,500 మంది హాజరయ్యారని నిర్వహకులు తెలిపారు. ఆంధ్రా హైస్కూలులో జరిగిన పరీక్షకు 1,250 మంది హాజరైనట్లు కరస్పాండెంట్ బొమ్మల శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం ఈ-అభ్యాస్ ప్రతినిధి రీజనల్ మేనేజర్ ఎం.కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో తరగతి వారీగా 1,2,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఏప్రిల్ 13న గుంటూరులో జరిగే కార్యక్రమంలో మెమోంటోలు, నగదు బహుమతులు, ఒలింపియాడ్ కిట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రతినిధులు శ్రీరాములురెడ్డి, వంశీ, నారాయణ, జగదీష్, శివప్రసాద్, యుగేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దాలికి సాంస్కృతిక కళాభూషణ్ పురస్కారం

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి):శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దాలి మాధవరావును శ్రీనిధి పాలిటెక్నిక్ వెటర్నరీ జూనియర్ కళాశాల వారు సాంస్కృతిక, సాహిత్య కళాభూషణ్ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానిక కళాశాలలో జరిగిన వేడుకల్లో ఫిషరీస్ యూనివర్సిటీ ఇన్విజిలేటర్ రమ్య, కళాశాల డైరెక్టర్ వాయిల విజయరత్నం చేతులమీదుగా మాధవరావుకు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

పంచలోహ ఉత్సవ విగ్రహాల బహూకరణ

కొండపి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొండపిలోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి స్థానిక రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్ ఆరికట్ల భద్రయ్య, సుజాత దంపతులు ఆదివారం రామలింగేశ్వరస్వామి, పార్వతీదేవీల పంచలోహ ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. దాసరెడ్డిపాలెం అంకమ్మ గుడి వద్ద నుంచి విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఈవిగ్రహాలకు శివరాత్రి సందర్భంగా కళ్యాణం జరిపిస్తారు.



శివతేజోమయం త్రిపురాంతక క్షేత్రం

బాలాత్రిపుర సుందరీదేవి మూల విరాట్



నేటి నుంచి ఐదు రోజులపాటు ఆలయంలో ఉత్సవాలు



త్రిపురాంతకేశ్వర దేవాలయం (ఇన్‌సెట్లో) స్వామివారి శివలింగం

త్రిపురాంతకం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఏకాదశ శివక్షేత్రాలలో త్రిపురాంతకక్షేత్రానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. త్రిపురాంతకం శ్రీశైలానికి తూర్పు ద్వారంగా ప్రసిద్ధి గాంచినది. ఈ క్షేత్రానికి కుమారగిరి అని పేరుకూడా ఉంది. త్రిపురాసులను సంహరించబడినందున ఈక్షేత్రం త్రిపురాంతకంగాను, శివుడు త్రిపురాంతకేశ్వరుడిగాను పిలుస్తారు. దేవతలు, రుషులు, సిద్ధులు సూక్ష్మ రూపంలో వచ్చి స్వామిని అర్చిస్తారని స్థల పురాణం చెబుతోంది. ఈ రస లింగాన్ని కేంద్రంగా చేసుకొని ఉపరితలంపై శ్రీ చక్ర పీఠమును ఏర్పాటు చేసి దానిపై ఆలయ నిర్మాణం చేశారు. పైభాగాన బ్రహ్మ జలలింగాన్ని ప్రతిష్ఠించారని ప్రతీతి. ఈ లింగానికి అభిషేకించిన జలం, భూగర్భంలో ఉన్న త్రిపురాంతకేశ్వరునికి చేరుతుందని ఉపాసకులు చెబుతారు. త్రిపురాంతకేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో అపరాజితేశ్వరలింగం, యజ్ఞేశ్వరలింగం, మారుతిలింగం, ఉగ్రేశలింగం, శివలింగాలు ఉన్నాయి. దేవాలయానికి నైరుతి భాగమున చీకటి గృహ ఉంది. దీనిని అగస్త్య మహర్షి నిర్మించారని ప్రతీతి. ఇక్కడ నుంచి శ్రీశైలానికి సొరంగ మార్గం ఉన్నట్లు పురాణాలు తెలియజేస్తున్నాయి. గృహ లోపలి భాగంలో భూగర్భంలో పాతాళేశ్వరుడుగా పిలువబడే శివలింగం ఉంది. త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయానికి దక్షిణ భాగాన చెరువులో బాలాత్రిపుర సుందరీదేవి ఆలయం ఉంది. ఇక్కడి అమ్మవారు చిదగ్నిగుండ సంభూతగా, కదంబ వనవాసినిగా పిలుస్తారు. త్రిపురాసుర సంహారం సమయంలో శివుడు ఆశక్తులై ఈ తల్లిని ప్రార్థిస్తే శివధనస్సును ఆవహించి త్రిపురాసురుని సంహరించిందని, రుగ్వేదంలో పొందుపరచినట్లు పురాణాల్లో ఉంది. గుండంలో బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారు నిర్గుణ శిలాకారంలో ప్రకాశిస్తూ ఉంటుంది.



చీకటి గుహ

నేటి నుంచి ఉత్సవాలు

మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి ఐదురోజులపాటు, విజయదశమి సందర్భంగా అమ్మవారికి తొమ్మిది రోజులపాటు నవరాత్రులు, ఉగాది సందర్భంగా నవరాత్రులు, స్వామివారికి గ్రామోత్సవం, వైశాఖ పౌర్ణమికి, శ్రావణపౌర్ణమికి అమ్మవారికి లక్షపుష్పార్చన, నవధాన్యార్చన, స్వామివారికి లక్షబిల్వార్చన నిర్వహిస్తారు. ప్రతి అమావాస్యకు చిన్నమస్తాదేవికి నిమ్మకాయలపూజలు, ప్రత్యేక సందర్భాలలో చండీహోమం, రుద్రహోమం, సహస్ర చండీ, రుద్రచండీ పూజలు నిర్వహిస్తారు. నిత్యం అమ్మవారికి అభిషేకం, ప్రాతఃకాలపూజలు, బాలభోగం, కుంకుమార్చనలు, అష్టోత్తరాలు, ఖడ్గమాల పూజలు నిర్వహిస్తారు.

ఈ ఏడాది మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 24 నుంచి మార్చి 2 వరకు ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈనెల 26న ఉదయం 3 గంటలకు స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, రాత్రి 11.30 గంటలకు లింగోద్భవ కాలపూజ, 12.30 గంటలకు కళ్యాణోత్సవం, 3 గంటలకు అలయ ఉత్సవం నిర్వహిస్తారు. 28న మధ్యాహ్నం 3 గంటలకు రథాంగ హోమం, రథాంగబలి, రథోత్సవం, మార్చి 1న బలిహరణ, పూర్ణాహుతి, మూకబలి, 2న రాత్రి 8 గంటలకు శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రత్యేకతలు

- ప్రపంచంలో శ్రీచక్ర ఆధారిత నిర్మాణమైన ఏకైక శివాలయం త్రిపురాంతకేశ్వరాలయం.
- ఈ క్షేత్రంలోనే ఆదిశంకరాచార్యులు లలితా సహస్ర నామం రచించినట్లు కొన్ని పురాణాలు తెలియజేస్తున్నాయి.
- ప్రపంచంలో ఏ శివాలయంలో మంత్రాలు చదవాలన్నా నమస్తే అస్తు భగవాన్, విశ్వేశ్వరాయ, మహాదేవాయ, త్రిపురాంతకాయ, త్రికాయ, కాలాగ్నిరుద్రాయ, నీలకంఠాయ, మృత్యుంజయాయ, సర్వేశ్వరాయ, సదాశివాయ, శ్రీమత్ మహాదేవాయ అని త్రిపురాంతకేశ్వరస్వామి నామాన్ని పఠించాల్సిందే.
- ఈ క్షేత్రంలో కనిపించే కదంబ వృక్షాలు కాశి క్షేత్రంలో మాత్రమే కనిపిస్తాయి.

- రెండు సెషన్స్‌లో నిర్వహణ
- కేంద్రాలను తనిఖీచేసిన కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ
- భద్రతను పరిశీలించిన ఎస్పీ దామోదర్
- ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించని అధికారులు

సజావుగా గ్రూపు-2 పరీక్ష

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఆదివారం సజావుగా జరిగింది. మొత్తం 4,544 మంది అభ్యర్థుల కోసం ఒంగోలులో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు సెషన్స్‌లో పరీక్ష నిర్వహించగా 87.29 శాతం మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఉదయం సెషన్‌కు 3,968 (87.32 శాతం) మంది హాజరుకాగా, 576 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌కు 3,965మంది (87.25 శాతం) మంది హాజరయ్యారు. 579 మంది గైర్హాజరయ్యారు.

రెండంచెల భద్రత ఏర్పాటు

అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఉదయం 8 గంటలకే చేరుకున్నారు. అక్కడ అధికారులు రెండంచెల భద్రతను ఏర్పాటు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి ఉదయం 9.45 తర్వాతనే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. వారికి సహాయకులుగా వచ్చిన వారిని బయటనే నిలిపివేశారు. పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలతో నిఘాను ఏర్పాటు చేశారు. వివిధ కారణాలతో రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం వద్దకు నలుగురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో హాలులోకి అనుమతించలేదు. చీమకుర్తి మండలానికి చెందిన ఒక మహిళా అభ్యర్థి గేటు వద్దనే పరీక్షకు అనుమతించాలని వేడుకున్నారు. అప్పటికే ప్రభుత్వం ఇచ్చిన గ్రేస్ పీరియడ్ ముగియడంతో అధికారులు అంగీకరించలేదు. క్విస్ కళాశాల వద్దకు కూడా ఒక అభ్యర్థి ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతించలేదు.

కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

కలెక్టర్ తమీమ్ అన్సారియా క్విజ్, రైజ్, పేస్ కాలేజీల్లోని సెంటర్లను తనిఖీ చేశారు. వాటిలో కొన్నిచోట్ల సదుపాయాలు సక్రమంగా లేకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. నాగార్జున, హర్షిణి, క్విస్, పేస్ కాలేజీల్లోని కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ సందర్శించారు. ఎస్పీ దామోదర్ స్వయంగా ఆయా పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లి భద్రతను పరిశీలించడంతోపాటు పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరోవైపు పోలీసు శాఖ ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్ వద్ద హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసింది.. అభ్యర్థులను ఆయా పరీక్షా కేంద్రాలకు తరలించేందుకు పోలీసు వాహనాలను కూడా ఏర్పాటు చేశారు. పరీక్షల అనంతరం జవాబు పత్రాలను ఆయా కేంద్రాల నుంచి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు తరలించారు. అక్కడ వాటిని బాక్సుల్లో భద్రపర్చారు. రాత్రికి ప్రత్యేక వాహనాల్లో పోలీసు బందోబస్తు మధ్య విజయవాడకు తరలించారు.

కాగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థుల పసిపిల్లలను వారి కుటుంబ సభ్యులు కేంద్రం వద్ద చీరలతో ఊయలలు కట్టి ఊపుతూ పాలు పట్టించారు. దివ్యాంగురాలైన అభ్యర్థిని మహిళా పోలీసులు స్కూటీపై ఎక్కించుకొని కేంద్రానికి తీసుకెళ్లారు. ఒక అంధ అభ్యర్థికి సహాయకుడు సహాయంగా నిలిచారు.




క్విస్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఆదర్శ ఉపాధ్యాయుడు

శ్రీనివాసరావు

- పది సంవత్సరాలుగా సెలవు పెట్టకుండా విధుల నిర్వహణ
- ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు 150 మంది విద్యార్థుల ఎంపికకు సహకారం
- ఇప్పటికే జిల్లా ఉత్తమ టీచరుగా అవార్డు

కురిచేడు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడు గత పది సంవత్సరాలుగా సెలవు పెట్టకుండా విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచారు. కురిచేడు మండలం బోదనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఊట్ల శ్రీనివాసరావు లెక్కలు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 150 మంది విద్యార్థులకు జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించడంతో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలకు మెచ్చిన ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి సత్కరించింది.



విద్యార్థులకు తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ కోసం విద్యార్థులను సమాయత్తం చేసి వారితో పరీక్షలు రాయించి ఎంపిక అయ్యేలా కృషి చేశారు. ఇప్పటివరకు 150 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ఎంపికైనవారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యేవరకు సంవత్సరానికి రూ.12 వేలు ప్రభుత్వం అందజేస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఈ స్కాలర్ షిప్ ఎంతో ఉపయోగపడుతున్నది. అతని సేవలకు మెచ్చి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేసి సత్కరించారు. ఆయన సహచరిణి కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలే కావడంతో ఆమె కూడా ఆయనకు అన్ని విధాలుగా సహాయపడుతూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాలలో వారి స్వగ్రామం వెంగాయపాలెం గ్రామంలో విద్యార్థుల అనుమానాలు నివృత్తి చేస్తూ వారి రాణించేలా కృషి చేస్తున్నారు.



స్టడీ అవర్స్‌ను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు



పిల్లల మధ్యలోనే సంతృప్తి

విద్యార్థుల మధ్యలోనే నాకు సంతోషం ఉంది. చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయ వృత్తి అంటే గౌరవం. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఎప్పటికీ రుణపడి ఉంటా. సెలవు పెట్టాలంటే ఎందుకో అసంతృప్తిగా ఉంటుంది. కొన్ని తప్పనిసరి పరిస్థితులు వచ్చినా పాఠశాల అనంతరమో, ముందో ఆ అవసరాలు తీర్చుకుంటున్నాను. ఈవిషయంలో నా భార్య సైతం సర్దుకుపోవడంతోనే పది సంవత్సరాలుగా సెలవు పెట్టకుండా పాఠశాలకు వస్తున్నాను.

\- ఊట్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, బోదనంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల

విద్యార్థిని ఆత్మహత్య

ఒంగోలు క్రైం,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): డిప్లమో చదువుతున్న పెద్దసింగు తులసి(16) ఆత్మహత్య చేసుకుంది. ఒంగోలు రూరల్ మండలం గుండాయిపాలెంనకు చెందిన తులసి పరీక్షలలో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపంతో ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

కుటుంబ సభ్యులు తులసి ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతుండగా కిందకు దించి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందిందని డాక్టర్లు చెప్పారు. ఒంగోలు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ షాపులు వెలవెల

కొనుగోలుకు ఆసక్తి చూపని ప్రజలు

ఖాళీగా దుకాణాలు

బర్డ్ ఫ్లూ లేదని పశువైద్యశాఖ అధికారులు చెప్తున్నా తొలగని భయాందోళనలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : చికెన్ కొనుగోళ్లపై ప్రజలు పెద్దగా ఆసక్తిని చూపలేదు. బర్డ్ ఫ్లూ ప్రభావంతో గత రెండు వారాల నుంచి చికెన్ కొనుగోళ్లు తగ్గుతూ వస్తున్నాయి. గత వారం తరహాలోనే చికెన్ ధరలు పెరగకపోయినా కొనుగోళ్లు మాత్రం కనిపించలేదు. రెండు వారాల క్రితం కిలో చికెన్ రూ. 250నుంచి 260 వరకు పలుకగా ప్రస్తుతం కిలో రూ. 150 ఉన్నా ఆయా షాపుల వద్ద పెద్దగా ప్రజలు కనిపించలేదు. ఆదివారం వచ్చిందంటే చికెన్ షాపుల వద్ద హడావుడిగా ఉండేది.

అటువంటిది ఆయా షాపుల వద్ద కనీసం పట్టుమని పది మంది కూడా కనిపించనిపరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా కొత్త మార్కెట్ సెంటర్‌లో ఆదివారం వచ్చిందంటే ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు కూడా వీలులేని విధంగా రద్దీ ఉండేది. అటువంటి ప్రాంతంలో కూడా ఖాళీగా ఉందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంకొక వైపు చికెన్ తినవచ్చని పశుసంవర్ధకశాఖ అధికారులు చెప్తున్నా ప్రజలు మాత్రం చికెన్ తింటే వ్యాధుల బారిన పడాల్సి వస్తుందేమోనన్నభయంతో ఆసక్తిచూపలేదు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు భక్తుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఒంగోలు డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన ఒంగోలు నుంచి కోటప్పకొండకు 45 బస్సులు, శ్రీశైలం పుణ్యక్షేత్రానికి మరో 25 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. కొత్తపట్నం, కొండపి, ఇంకొల్లు, వేములపాడు, శింగరాయకొండ, పొందూరు, టంగుటూరు నుంచి కోటప్పకొండ, శ్రీశైలంకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా, అందుకోసం అదనంగా సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఒంగోలు నుంచి విజయవాడ నాన్-స్టాప్ (ఇంద్ర) సేవలను 24వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సాధారణ చార్జీలతోనే భక్తులకు పుణ్యక్షేత్రాలను దర్శించుకునే అవకాశం ఉందన్నారు. భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం డిపో మేనేజరు సెల్ : 9959225695 ద్వారా సంప్రదించాలన్నారు.

వైభవంగా రేణుకమ్మ విగ్రహ ప్రతిష్ఠ

గోవింద నామస్మరణతో మార్మోగిన పంగులూరు

వేలాదిగా పాల్గొన్న భక్తులు

పంగులూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో రేణుకమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ప్రతిష్ఠోత్సవం సమయంలో భక్తుల గోవింద నామ స్మరణతో పంగులూరు హోరెత్తింది. ఉదయం 10.23 గంటలకు దివ్య ముహూర్తంలో తెనాలికి చెందిన ప్రముఖ వేద పండితులు శ్రీ వేముల శ్రీహరి చౌదరి వారి రుత్విక్ బృందం ఏకకాలంలో రేణుకమ్మ అమ్మవారితో పాటు పోతురాజు, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలను వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంగులూరు పరిసర ప్రాంతాల నుంచి రాయిణి వంశస్థులు వారి బంధుమిత్రులు, భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్‌తో పాటు విశ్రాంత ఆర్మీశాస్త్రవేత్త రాయిణి రామారావు, సుబ్బారావు దంపతులు, రాయిణి వంశస్థులు రేణుకమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠోత్సవానికి వచ్చిన వేలాదిమంది భక్తులకు అన్నదానం చేశారు.



విగ్రహ ప్రతిష్ఠ అనంతరం పూజలో పాల్గొన్న ఏఎస్పీ విఠలేశ్వర్ తదితరులు

రేణుకమ్మ ఆలయంపై శిఖర ప్రతిష్ఠ చేస్తున్న వేద పండితులు

ఆహార సలహా సంఘ సమావేశం నిర్వహించాలి

మార్కాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదిన్నర కాలంగా నిలిచిపోయిన ఆహార సలహాసంఘం సమావేశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చొరవ తీసుకుని నిర్వహించాలని ప్రకాశం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షులు ఓరుగంటి మల్లిక్ కోరారు. ముఖ్యంగా వినియోగదారులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశాలు నిర్వహించకపోవడంతో పౌరసరఫరాలశాఖ పనితీరును, రేషన్ బియ్యం అక్రమ రవాణ, కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ. ధరల నియంత్రణ తదితరాల్లో మోసాలు జరుగుతున్నాయన్నారు. అక్రమాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేకపోతున్నామన్నారు. వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక దృష్టిసారించి విజిలెన్స్ సలహాసంఘ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

పుస్తక పఠనంతో మేధోవికాసం


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 23: గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేయడం ద్వారా విద్యార్థులకు మేధో వికాసం కలుగుతుందని గ్రంథపాలకురాలు ఝాన్సీ అన్నారు. ఆదివారం ఎర్రగొండపాలెం గ్రంథాలయంలో చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల నుంచి 5వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొని గ్రంథాలయంలోని పుస్తకాలను చదివించారు.

శివాలయాల్లో విశేష పూజలు

- శ్రీశైలానికి నడక మార్గంలో తరలుతున్న భక్తులు
- పొదిలి నిర్మమహేశ్వర ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొంగళవీడు రోడ్డులోని మడియాలేశ్వర స్వామి దేవస్థాన పంచమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మడియాలేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన కమిటీ ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు ఆవులమంద శ్రీనివాసులు, బాలచెన్నయ్య, గుర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారు శేషవాహనంపై అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. సోమవారం స్వామివారు హంసవాహనంపై చతుర్ముఖ బ్రహ్మ అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.


అర్ధనారీశ్వరుడిగా నిర్మమహేశ్వరుడు

పెద్దదోర్నాల : మహాశివరాత్రి పర్వదినం సందర్భం గా భక్తులు పెద్దఎత్తున నల్లమల్ల అటవీమార్గంలో శ్రీశైలం తరలివెళ్లారు. అయితే కొందరు బస్సుల్లోనూ, వాహనాల్లోనూ కొండకు వెళ్తుండగా మరికొందరు కాలినడకే గౌరీశంకరుల దర్శనానికి వెళుతున్నారు. అధిక సంఖ్యల్లో రాయల సీమ, కర్ణాటక నుంచి భక్తులు కాలనడకన వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో శివభక్తులకు పలు సంస్థలు తాగునీరు, మజ్జిగ, వైద్యం, అన్నదానం చేస్తున్నాయి. ఇస్కాన్ సంస్థ, శ్రీనిధి ఎంటర్‌ప్రైజస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానంలో ఎంపీ శబరి, అభయ హిందూసేవ వ్యవస్థాపకులు శ్రీమాన్ రాధా మనోహర్ దాస్‌లు పాల్గొని భక్తులకు ఆహార పదా ర్థాలు వడ్డించారు.

పెద్దదోర్నాల : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకుని శ్రీశైలం వెళ్లే భక్తులకు బొమ్మలాపురం గ్రామకమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు. ఏటా ఐదు రోజుల పాటు ఉదయం, సాయంత్రం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు తెలిపారు.



మడియాలేశ్వర దేవస్థానంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, దోర్నాలలో భక్తులకు అన్నదానం


ఎర్రగొండపాలెంలో దీక్షధారుల పూజలు

మొక్కులు చెల్లించుకున్న భక్తులు

కంభం : సర్వమతాల ఆరాధ్యదైవ్యం కోటా సత్యమాంబదేవి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ప్రతి ఆదివారం కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల నుంచి భక్తులు భారీగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. నూతన వాహనాలు కొనుగోలు చేసిన వారు, ఉన్న వారు తమ వాహనాలకు ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రత్యేక పూజలు చేయించుకుంటారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయం

ఎర్రగొండపాలెం రూరల్ : ఎర్రగొండపాలెంలోని శివాలయంలో దీక్షలు చేపట్టిన స్వాములు పడిపూజ కార్యక్ర మాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 45 రోజుల పాటు శివదీక్షల అనంతరం మహాశివరాత్రికి పుణ్యక్షేత్రం శ్రీశైలానికి వారు బయలు దేరనున్నారు. అందులో భాగంగా ఆది, సోమవారం రోజుల్లో శ్రీశైలం దేవస్థానానికి ఇరుముడులు ధరించి బయలుదేరి వెళుతున్నారు. ఈ సందర్భంగా శివాలయంలో విశేష పూజలు నిర్వహించారు.

ఉర్దూ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలి

మార్కాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువుకట్ట సమీపంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని స్థానిక గొర్లగడ్డకు చెందిన ప్రజా ప్రతినిధులు, ముస్లిం మైనార్టీలు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కోరారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. ఉర్దూ ప్రాథమిక పాఠశాలను 1950వ సంవత్సరంలో ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఉర్దూ మాధ్యమంలో విద్యార్థులకు బోధన చేస్తున్నట్లు తెలిపారు. కానీ జీవో నంబరు 117 రద్దుతో పాఠశాల పునః నిర్మాణంలో భాగంగా ఉర్దూ పాఠశాలలోని 3, 4, 5 తరగతులను కిలోమీటర్ల దూరంలోని తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమ పాఠశాలలకు తరలిస్తారన్నారు. దీంతో ముస్లిం మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. మార్కాపురంలో ఉన్న ఏకైక ఉర్దూ పాఠశాల కావడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, మాజీ కౌన్సిలర్ బషీరున్నీసాబేగం, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాధిక్, టీడీపీ మైనార్టీ నాయకులు మొఘల్ షాకీర్‌హుసేన్‌బేగ్, గఫార్‌ఖాన్, ఖలీలుల్లా ఖాన్, ఆయూబ్‌ఖాన్, ఎంహెచ్‌పీఎస్ పట్టణ అధ్యక్షులు మొఘల్ జాబీర్‌హుసేన్‌బేగ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న ముస్లిం మైనారిటీలు

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 23 ఆంధ్రజ్యోతి: స్థానిక జవహర్ నగర్ కాలనీలో రజక విద్యాసేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.శంకర్ ఆధ్వర్యంలో సంత్ గాడ్గేబాబా జయంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాడ్గేబాబా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన గాడ్గేబాబా సంఘ సంస్కర్తగా గ్రామాల్లో శుభ్రత పాటించాలని బోధిస్తు కుల నిర్మూలన, అంటరానితనం నిర్మూలన కోసం పాటు పడ్డారన్నారు. స్వచ్ఛ భారత్‌ను కనిపెట్టి అనుసరించిన మహా నాయకుడని ఆయనను స్వచ్ఛభారత్ పితామహుడిగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో డి.వెంకటేశ్వర్లు, ఆర్.కాశయ్య, శివయ్య, ఎం.రంగ నాయకులు, ఎస్.శ్రీనివాసరావు, కాశయ్య, వెంకటేశ్వర్లు, చిరంజీవి, శివయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


గాడ్గే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘ నాయకులు

కల్వర్టును ఢీకొన్న కారు

ఇద్దరికి తీవ్ర, ముగ్గురికి స్వల్పగాయాలు

కంభం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట నుంచి మార్కాపురం వెళుతున్న కారు కంభం పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో కల్వర్టును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం, బేస్తవారపేటకు చెందిన కాశిరెడ్డి తన ముగ్గురు మిత్రులు, డ్రైవర్‌తో కలిసి కారులో మార్కాపురానికి వెళుతున్నాడు. వేగం అదుపు తప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో పొలంలో బోల్తా పడింది. కారులో ఉన్న కాశిరెడ్డికి, డ్రైవర్ చందుకు తీవ్రగాయాలయ్యాయి. కాగా మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. కంభంలోని ప్రైవేటు వైద్యశాలలో గాయపడిన వారు చికిత్స పొందుతున్నట్లు, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకుల మృతి

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతిచెందారు.

ఎర్రగొండపాలెం మండలంలోని మిల్లంపల్లి పంచాయితీ పరిధిలో అటవీ కార్యాలయ సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరగ్గా పులిచర్ల గురవయ్య అనే వ్యక్తి మృతిచెందారు. వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడడంతో ఈ ఘటన చోటుచేసుకొంది. స్థానికుల సమాచారం మేరకు పుల్లలచెరువు మండలం కొమరోలు గ్రామానికి చెందిన యువకుడు పులిచెర్ల గురవయ్య పనుల నిమిత్తం బైకుపై ఎర్రగొండపాలెం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో నడుచుకుంటూ వెళుతున్న ఇద్దరు యువకులను తప్పించబోయి అదుపుతప్పి బైక్ బోల్తా పడింది. దీంతో ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఇద్దరు యువకులకు స్వల్ప గాయాలు అయినట్లు వైద్యులు తెలిపారు ఈ విషయంపై ఎస్సై చౌడయ్యను వివరణ కోరగా, సమాచారం తెలిసిందని విచారిస్తున్నామని తెలిపారు.


మృతిచెందిన గురవయ్య

ట్రాలీవాహనం ఢీకొన్న ఘటనలో..

మార్కాపురం రూరల్ : రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన ఘటన మండలంలోని బొడిచెర్ల గ్రామ పరిధిలోని భూదేవి ఆలయం వద్ద శనివారం చోటుచేసుకొంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొడిచెర్లకు చెందిన బండి సునీల్ తన వ్యక్తిగత పనులపై కంభం వైపు వెళుతున్నాడు. అదేసమయంలో ట్రాలీ వాహనం కంభం వైపు నుంచి మార్కాపురం వస్తోంది. ఈ రెండు బొడిచెర్ల గ్రామ పరిధిలోని భూదేవి ఆలయం వద్ద ఢీకొన్నాయి. దీంతో సునీల్ తలకు బలమైన గాయమైంది. దీంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. వాహనంలో మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా సునీల్ మృతి చెందాడు. సునీల్ తల్లి మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అంకమ్మరావు తెలిపారు. సునీల్ మృతదేహాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.


సునీల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

వైద్యరంగంలోని మార్పులపై అవగాహన పెంచుకోవాలి

- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో వస్తున్న ఆధునిక మార్పులపై అవగాహన పెంచుకోవాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రోగామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని రిమ్స్ వైద్యకళాశాలలో జరిగిన డెర్మటాలజీ విభాగం జోనల్ వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుఖ వ్యాధులు, హెచ్‌ఐవీ చికిత్స, నివారణలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, విధానాలపట్ల వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. వైద్యులు నిరంతర అధ్యయనం ద్వారా మెలకువలు నేర్చుకుని రాణించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే పరిశోధనలపట్ల ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, కాటూరి మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరమ్మ, సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ ఆలిమ్స్, విశ్వభారతి వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బి.ఉదయ్‌కు మార్, రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, జీజీ హెచ్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


రిమ్స్‌లో వర్క్ షాప్ ప్రారంభిస్తున్న శ్రీనివాసప్రసాద్

26న ఎడ్ల బలప్రదర్శన పోటీలు

కంభం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చిన్నకంభంలో వెలసిన శ్రీభద్రకాళిసమేత వీరభద్రస్వామి కళ్యాణ మహోత్సవం ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 26న బుధవారం 2 పండ్ల విభాగం, ఎడ్ల పోటీలు నిర్వహించనున్నారు. వరుసగా విజేతలకు రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనేవారు 26వ తేదీలోగా ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాలని తెలిపారు. 28న రథోత్సవం, రాత్రి పాటకచేరి ఉంటుందని తెలిపారు.

27న మోక్షగుండంలో..

బేస్తవారపేట : మండలంలోని మోక్షగుండం గ్రామంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 27న ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిలకల వెంకటరెడ్డి తెలిపారు. ప్రథమ బహుమతి రూ50వేలు, రెండవ బహుమతి రూ.30వేలు, మూడవ బహుమతి రూ.20వేలు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు ముందుగానే పేర్లు నమోదు చేయించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వివరాలకు 9885048606, 9989147437 నంబర్లను సంప్రదించాలన్నారు.

టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యునిగా నూరుల్లా

మార్కాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణానికి చెందిన షేక్ నూరుల్లా జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు. ఈ మేరకు టెలికం అధికారులు శనివారం నియామకపత్రం అందజేశారు. టీడీపీలో కీలక కార్యకర్తగా నూరుల్లా పనిచేస్తున్నారు. తనకు టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యునిగా అవకాశం కల్పించిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి పాల్గొన్నారు.


నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నూరుల్లా

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


విశేష అలంకరణలో పోలేరమ్మ

స్వచ్ఛాంధ్రకు సహకరించాలి

- గ్రామ కార్యదర్శి శివ కోటేశ్వరరావు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి శివకోటేశ్వరరావు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర నిర్మాణానికి సహకరించాలని దోర్నాల గ్రామకార్యదర్శి నలగాటి శివకోటేశ్వరరావు ప్రజలను కోరారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మేజరు పంచాయతీ పరిధిలోని ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. రెండు రోజుల్లో ఇంటింటికి చెత్తసేకరణ రిక్షాలు వస్తాయని ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరు చేయాలన్నారు. తద్వారా పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు. తడిచెత్తను వర్మీ కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు తక్కువ ధరకు విక్రయించనున్నట్లు ఆయన తెలిపారు.

బీజేపీ శ్రేణుల 'గ్రామబాట'

గిద్దలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామబాట కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు రాచర్ల మండలంలోని పలు గుంటిపల్లి, రాచర్ల గ్రామాలలో పర్యటించారు. వీధుల్లో తిరిగి ప్రజలను కలుసుకొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలుగుంటిపల్లి గ్రామంలో కాశమ్మ అనే వృద్ధురాలిని పరామర్శించారు. మంచానికే పరిమితమైన ఆమెకు రూ.15వేల పింఛన్ లభించలేదని తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పింఛన్ వచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆమెకు పండ్లు, రొట్టెలు అందజేశారు. గ్రామాలలో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. రాచర్ల బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జేవీ.నారాయణ, బీజేపీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు ఎం.పుల్లయ్య, వీరచక్రం, తదితరులు పాల్గొన్నారు.


వృద్ధురాలికి పండ్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు

రైతులందరూ విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి

పీసీపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన ప్రతిరైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని సాయిల్ కన్జర్వేషన్ డీడీఏ ఎం.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మారెళ్ల, వెంగళాయపల్లి, పీసీపల్లి, నేరేడుపల్లి గ్రామాల్లో ఏడీఏ వెంకటరమణతో కలిసి విశిష్టసంఖ్య రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలు, బీమా తదితర పథకాలు పొందేందుకు భూములు కలిగిన రైతులందరూ విశిష్టసంఖ్యను నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.ప్రకాశరావు, ఆయా గ్రామాల వీఏఏలు పాల్గొన్నారు.

చెత్త సంపదతో గ్రామాభివృద్ధి

ముండ్లమూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చెత్త సంపద గ్రామాల అభివృద్ధికి తోడ్పడతాయని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. ఆదివారం మండలంలోని నాయుడుపాలెం, కెల్లంపల్లి, ఉమా మహేశ్వర అగ్రహారం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రంలో వేయాలన్నారు. దీంతో తయారైన ఎరువును అమ్మకాలు చేసి వచ్చిన ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ఇళ్ల వద్ద చెత్తను తీసి వేయటం వల్ల పరిసరాల పరిశుభ్రతతోపాటు ఎటువంటి వ్యాధులు రావన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.సురేష్‌రెడ్డి, గురునాథం, సర్పంచ్‌లు గొర్రె శ్రీదేవి, జమ్ముల గురవయ్య, వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

పామూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బెల్లంకొండ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బెల్లంకొండ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం జరిగిన శ్రీ ఆదిత్య, రత్నం, బెల్లంకొండ విద్యాసంస్థల ఫేర్‌వెల్ కార్యక్రమానికి విద్యాసంస్థల కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఎస్‌ఐ కిశోర్‌బాబు మాట్లిడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేస్తే ఉజ్జల భవిషత్తు సొంతం అవుతుందన్నారు. బలహీనతలకు లొంగకుండా లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయలుఉ సయ్యద్ ఖాదర్‌వలి, వెంకటసుబ్బయ్య, మాలకొండయ్య, విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ కృష్ణంరాజు, నరసింహారావు, శ్రీను, వెంకటేశ్వర్లు, నారాయణరావు, సూర్య, షేక్ షరీఫ్, నాగరాజు, వాయినేని మాధవ పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నేత మృతి

కురిచేడు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గంధం గురునాథం(50) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. గురనాథం అకాల మృతిపట్ల మండల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు

» అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశం



పునుగోడు నీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

కనిగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా, డివిజన్ ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సాగర్‌నీటి సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలు, వివిధ సమస్యలపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణతోపాటు ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేదిశగా అధికారులు తగిన ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సరఫరాలో అంతరాయం, సమస్యలు తలెత్తకూడదని అధికారులను ఆదేశించారు. ఫ్లోరోసిస్ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తగిన ప్రణాళికతో ముందుకుసాగాలన్నారు. రామతీర్థం రిజర్వాయర్ నుంచి కనిగిరికి సరఫరా అయ్యే పైపులైను మరమ్మతులకు గుర్తైనచోట వెంటనే మార్చాలన్నారు. ఆయా పైపుల స్థానంలో నాణ్యతగా ఉండే పైపులను వేసేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. కనిగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ అధికంగా ఉన్న గ్రామాలను, పునుగోడు నీటి సరఫరా కేంద్రాన్ని, ప్రభుత్వాసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎమ్మెల్యే సూచనతో ప్రత్యేకంగా సందర్శించారు. మండలంలోని దిరిశవంచ, కమ్మవారిపల్లి, పునుగోడు, ఎస్టీకాలనీ తదితర ప్రాంతాల్లోని నీటి నమూనాలను సేకరించి నివేదిక సిద్ధం చేశారు. సంబంధిత గ్రామాల్లో ఫ్లోరైడ్ శాతం 4.9, 3.3, 5.7, పీపీఎంగా ఉన్నట్లు గుర్తించినట్లు ఎమ్మెల్యేకు వివరించారు. సదరు నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, ఈఈ ఎం.సురేష్‌బాబు, డీఈఈ విశ్వనాథరెడ్డి, ఏఈఈ ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నీటి సరఫరా జరిగే మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

అర్ధంతరంగా ఆగిన రోడ్డు నిర్మాణం

» సగం వరకు తారురోడ్డు వేసి వదిలేసిన వైనం
» ఇబ్బందులు పడుతున్న పది గ్రామాల ప్రజలు



వేములబండ నుంచి ఈదర వరకు తారు రోడ్డు నిర్మించక పోవటంతో మట్టి రోడ్డుగా మిగిలి పోయిన రహదారి

ముండ్లమూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అర్ధంతరంగా ఆగిన రోడ్డు నిర్మాణంతో పది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పసుపుగల్లు నుంచి ఈదర గ్రామం వరకు వెళ్ళే ప్రధాన రహదారిలో సగం వరికే తారు రోడ్డు వేసి వదిలివేశారు. మిగతాది మట్టి రోడ్డుగానే మిగిలి పోయింది. దీంతో మార్గంలో ప్రయాణించలేక ప్రజలు, వాహనచోదకలుఉ పడరానిపాట్లు పడుతున్నారు.

2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అప్పటిమంత్రి శిద్దా రాఘవరావు పసుపుగల్లు నుంచి ఈదర వరకు 13 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ.10 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తొలుత పసుపుగల్లు నుంచి వేములబండ వరకు రూ.5 కోట్లు మంజూరు కావటంతో, ఆ నిధులతో వేములబండ వరకు తారు రోడ్డు నిర్మించారు. ఆతర్వాత 2019లో ఎన్నికలు రావటం, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మిగతా రహదారి సంగతి మరిచిపోయారు. అప్పటి నుంచి తారు రోడ్డు నిర్మాణం నోచుకోలేదు. దీంతో రమణారెడ్డిపాలెం, అయోధ్యనగర్, ఈదర, బొప్పుడివారిపాలెం, భీమవరం, నూజెండ్ల మండలం కొత్తపాలెం గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు పలుగ్రామాలకు చెందిన వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధ్వానంగా ఉన్న రహదారిలోనే ప్రయాణం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం ఈమార్గంలో పదుల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఈగ్రామాల ప్రజలు మండల కేంద్రం ముండ్లమూరు రావాలన్నా, నియోజక వర్గ కేంద్రం దర్శి, అద్దంకి పట్టణాలకు వెళ్లాలన్నా ఈమార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ రహదారిలో సగం తారు రోడ్డుగా వేసి మిగతాది వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిగిలిన నాలుగున్నర కిలోమీటర్ల మట్టి రోడ్డులో తారు రోడ్డు వేయాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రూ.12 కోట్లతో ప్రతిపాదనలు పంపాం
- మహమ్మద్ రఫీ, జేఈ, ఆర్అండ్‌బీ

పసుపుగల్లు నుంచి వేములబండ వరకు తారు రోడ్డు నిర్మించాం. అక్కడి నుంచి ఈదర వరకు తారు రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇందుకోసం రూ.12 కోట్లు అవసరమని నాబార్డుకు ప్రతిపాదనలు పంపాం. అనుమతి రాగానే టెండర్లు పిలిచి తారురోడ్డు నిర్మిస్తాం. అలాగే, పసుపుగల్లులో కొంత భాగం సిమెంట్ రోడ్డు, చింతలపూడి, పసుపుగల్లు వద్ద బ్రిడ్జిలు నిర్మించటానికి ప్రతిపాదనలు పంపాం.



పసుపుగల్లు నుంచి వేములబండ వరకు నిర్మించిన తారు రోడ్డు

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో గల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి చల్లంగా కరుణించమ్మా గంగమ్మ అంటూ వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరాజు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌పి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

భక్తిశ్రద్ధలతో పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అర్చకులు స్వామివార్ల మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహానైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామి వారికి సమర్పించారు. అనంతరం గోశాలలోని గోమాతలకు పసుపు, కుంకుమాలతో పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మహాశివరాత్రి సందర్భంగా దేవస్థానంలో జరుగుతున్న 67వ సప్తాహ్నిక బ్రహ్మోత్సవాల వేడుకల్లో భాగంగా పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శేషవాహనంపై స్వామివార్లను అలంకరణచేసి గ్రామోత్సవం నిర్వహించారు.

కార్యక్రమాల్లో దేవస్థాన వ్యవస్థాపక ఛైర్మన్ కొమ్మినేని ఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా!

తాళ్లూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తూర్పుగంగవరం -తాళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలివేశారు. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మూడునెలల క్రితం తాళ్లూరు నుంచి 5వ కిలోమీటర్ వరకు తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేశారు. తూర్పుగంగవరం వరకు మిగిలిన కిలోమీటర్ వరకు కొంతమేర రోడ్డు నిర్మాణపనులు చేపట్టారు. రెండు నెలల క్రితం రోడ్డు పనులు చేపట్టి మిక్సింగ్ మెటల్ వేశారు. కొన్ని రోజులపాటు నీటితో తడిపి దువ్వ, కంకర లేవకుండా చేశారు. ఆతర్వాత నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలివేశారు. ఆరోడ్డుపై తారురోడ్డు వేయక పోవటంతో కంకరలేచి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఈరోడ్డుపై వాహనాలు ప్రయాణించే సమయంలో టైర్ల కిందపడ్డ చిన్నపాటి కంకరరాళ్లు లేచి ప్రయాణికులపై పడుతుండటంతో గాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తారు రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



కంకర లేచిన తూర్పుగంగవరం-లింగాలపాడు రోడ్డు

అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా



దర్శిలో ఎన్ఏపీ ట్యాపు వద్ద నీటిని పట్టుకుంటున్న తూర్పుచౌటపాలెంకు చెందిన మహిళ

దర్శి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎన్ఏపీ రక్షిత మంచినీటి పథకం నిర్వహణ అధ్వానంగా మారింది. తాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా జరుగు తుండటంతో అనేక గ్రామాలకు మంచినీరు సక్రమంగా అందటం లేదు. కాలంచెల్లిన పైపులైన్లు పగిలిపోవటంతో నీటి సరఫరాకు ఇబ్బంది కల్గుతుంది. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు దర్శి పట్టణానికి వచ్చి బబుల్స్‌లో మంచినీటిని తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

గత కొంతకాలంగా మండలంలోని తూర్పుచౌటపాలెం, సామంతపూడి, నిమ్మారెడ్డిపాలెం గ్రామాలకు మంచినీరు సక్రమంగా సరఫరా రావడం లేదు. వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే అరకొరగా విడుదల చేస్తున్నారు. దీంతో ఆ గ్రామాలకు చెందిన మహిళలు దర్శికి వచ్చి బబుల్స్‌లో నీరు పట్టుకొని తీసుకెళ్లే దుస్థితి నెలకొంది. వేసవికాలం వస్తుండటంతో సంబంధిత అధికారులు అప్రమత్తం కాకపోతే భవిష్యత్తులో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చే పరిస్థితి నెలకొంటుంది.

డిప్యూటీ ఈవోకు సన్మానం



చంద్రమౌళీశ్వర్‌ను సన్మానిస్తున్న డీఈవో, ఎంఈవో, ఉపాధ్యాయులు

కనిగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విలువలతో కూడిన విధులు నిర్వహించిన అధికారి డిప్యూటీ ఈవో చంద్రమౌళీశ్వర్ అని డీఈవో కిరణ్ కుమార్ అన్నారు. బదిలీపై గత నెల ఒంగోలుకు వెళ్లిన చంద్రమౌళీశ్వర్‌కు ఆదివారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో ఎంఈవోల సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి డిప్యూటీ ఈవో ఎంతో కృషి చేశారన్నారు. పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మార్కాపురం డిప్యూటీ ఈవో శామ్యూల్‌జాన్, హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు వెంకట్రావు, ఎంఈవోలు నారాయణరెడ్డి, ఆర్.శ్రీనివాసులు, కొండారెడ్డి సంజీవి, శ్రీనివాసులు, సాంబశివరావు, రంగయ్య, రమాదేవి, కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన

దొనకొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా దొనకొండ సర్పంచ్ గ్రేస్ రత్నకుమారి ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయితీ కార్యదర్శి పికృష్ణమూర్తి ఇంటింటికి వెళ్లి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేయటం వల్ల జరిగే ఇబ్బందులను వివరించారు. పరిశుభ్రమైన దొనకొండ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

దర్శి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువలో పడి గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు గజ ఈతగాళ్ల ద్వారా వెతికించగా ఒంగోలు బ్రాంచ్ కాలువలో ఎస్‌కేజీ పవర్ ప్రాజెక్టు వద్ద మృతదేహం దొరికింది. మండలంలోని నడింపల్లి గ్రామానికి చెందిన కుప్పాల వీరనారాయణ (17) శనివారం మధ్యాహ్నం కాలువలో పడిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు యువకుడి కోసం కాలువలో ఈతగాళ్ల ద్వారా వెతికించారు. మృతదేహం ఓబీసీలో లభించటంతో కుటుంబసభ్యులకు అప్పగించారు.

గ్రంథాలయానికి వితరణ

దర్శి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయానికి పుస్తకాలు అమర్చుకునే స్టీల్‌ర్యాక్, రెండు కుర్చీలను ఎల్‌వీ రాయుడు బహూకరించారు దర్శి గ్రంథాలయంలో కనీస వసతులు లేక పాఠకులు ఇబ్బందిపడుతున్న విషయం తెలిసిందే. ఎన్నో సంవత్సరాలుగా అద్దెభవనంలో నడుస్తుంది. మెటీరియల్ కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేదు. ఈవిషయాన్ని గుర్తించిన రాయుడు తనవంతు సహకారంగా ఆ వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి విజయకుమారి, ఎల్‌వీ రమణయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'పై కరపత్రాల పంపిణీ

కురిచేడు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సర్పంచ్ నక్కా రామకృష్ణ, కార్యదర్శి బాషా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మన ఊరిని మనం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాలలో వేసుకొని డంపింగ్ యార్డు వద్ద పడేయాలని కరపత్రాలు అందిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నక్కా నాగపెద్దిరాజు, సోమేపల్లి సుబ్బయ్య, పల్లె ఇజ్రాయేలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలి

పామూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అణుగుణంగా ప్రతిఒక్కరూ జీవన శైలిని మెరుగుపరుచుకొంటే చక్కని ఆరోగ్యంతో ఎక్కువ కాలం జీవించవచ్చునని ఒంగోలు ఉపాస్ సూపర్‌స్పెషాలిటి హాస్పిటల్ డాక్టర్లు ప్రకాష్ చవల, శ్రీధర్ చివుకల, ఎన్.పవన్‌కుమార్ సూచించారు. స్థానిక సూర్యచంద్ర సేవా సంస్థ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ సమాకారంతో స్థానిక పద్మావతి అతిథి గృహంలో ఆదివారం మెడికల్ క్యాంపు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ఎముకల సాంద్రత, ఈసీజీ, బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. పలు ఆరోగ్య సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మీడియా ఛైర్మన్ చక్కా వెంకటకేశవరావు, వాసవీమాత దేవస్థాన మాజీ ఛైర్మన్ వై.బాలకొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



పురందేశ్వరికి నారాయణస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న మాధవప్రసాద్

సీఎస్‌పురం (పామూరు), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో జరుగుతున్న 67వ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని ఆహ్వానించినట్టు దేవస్థాన మాజీ ఛైర్మన్ పాములపాటి మాధవ ప్రసాద్ తెలిపారు. ఆదివారం విజయవాడలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసినట్టు తెలిపారు.

వాసవీమాత దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న నరసింహారావు

పామూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణస్వీకారం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా నెల్లూరు రోడ్డులోగల సత్యదేవుని దేవస్థానం నుంచి మేళతాళాలతో ప్రదర్శనగా వాసవీమాత దేవస్థానానికి చేరుకొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడిగా వి.సత్యనారాయణ, అధ్యక్ష కార్యదర్శులుగా కోట నరసింహారావు, జీవీ గురునారాయణ, ఉపాధ్య క్షుడిగా ఎం.మధుసూదనరావు, కోశాధికారిగా దరిశి రాజేష్, సహాయ కార్యద ర్శులుగా కె.హరగోపాల్, ఆర్.సాయిబాబా, సహాయ కోశాధికారులుగా టి.చంద్రశేఖర్, దరిశి సురేష్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో మా జీ సర్పంచ్ డీవీ మనోహర్, దరిశి రాము, వైవీ సాయికిరణ్, ఎం.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ వెంటే నడుస్తాం

కనిగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకై కృషిచేసి సాధించిన మందకృష్ణ మాదిగ వెంటే నడుస్తామని జైభీం వ్యవస్థాపక అధ్యక్షుడు సూరే రాజన్న ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను అనంతపురంలో సన్మానించారు. ఈసందర్భంగా ఆయనను రాజన్న కలిసి అభినందనలు తెలిపారు. దళిత సంక్షేమం కోసం పోరాడే మందకృష్ణ మాదిగ వెంటే నడుస్తామన్నారు.








విద్యుత్ ప్రభ

గ్రామాల్లో పోటాపోటీ..

ప్రభల నిర్మాణంలో గ్రామాలకు గ్రామాలు పోటీ పడతాయి. గ్రామ గౌరవ ప్రతిష్ఠ కోసం అందంగా ప్రభలను నిర్మించడంలో పోటీ ఉంటుంది. ఈ ప్రభలలో పోస కూర్పు ప్రభలు, మండపాల ప్రభలు, టిక్కీల ప్రభలు, విద్యుత్ ప్రభలు, బాల ప్రభలు తదితరాలు ఉంటాయి. సంస్కృతి, సంప్రదాయాలకు ఇవి అద్దం పడతాయి. చిలకలూరిపేట మండలంలోని కావూరు, మద్దిరాల, యడవల్లి, కమ్మవారి పాలెం, పురుషోత్తపట్నం, నాదెండ్ల మండలం అమీన్‌సా హెబ్‌పాలెం, అప్పాపురం, నరసరావుపేట మండలం ఉప్పలపాడు, గురవాయపాలెం గ్రామాల నుంచి భారీగా విద్యుత్ ప్రభలు కొండకు తరలిరానున్నాయి. గతంలో ఎడ్లతో ప్రభలను తరలించేవారు. నేడు ట్రాక్టర్ల ద్వారా ప్రభలను తరలిస్తున్నారు. రాతితో తయారు చేసిన చక్రాల రథాలపై ప్రభలను ఏర్పాటు చేసి కొండకు తరలిస్తారు. 90 అడుగుల ఎత్తులో నిర్మించే ప్రభలను ప్రత్యేకంగా తయారు చేసిన రథాలపై అమరుస్తారు. ప్రభ పగ్గాలు పట్టేందుకు వందలాది మంది పాల్గొంటారు. రథం ఇరుసు విరిగితే వెను వెంటనే తయారు చేసేందుకు సంబంధిత పని వారు వెంట నడుస్తారు.

నేత్ర పర్వం ప్రభల సంబరం

- ఒక్కో ప్రభ ఎత్తు 90 అడుగులు
- పోటాపోటీగా విద్యుత్ ప్రభల నిర్మాణం
- ప్రభల పండుగగా కోటయ్య తిరునాళ్ల ప్రసిద్ధి

(కోటప్పకొండ/నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
మహిమాన్విత క్షేత్రంగా వెలుగొందుతున్న కోటప్పకొండ తిరునాళ్లలో కొలువు తీరే ప్రభలు నేత్ర పర్వంగా దర్శనమివ్వనున్నాయి. మహా శివరాత్రి పండుగ సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో 26న బుధవారం జరిగే తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశ ప్రసిద్ధి చెందిన కోటయ్య తిరునాళ్లకు ప్రభల పండుగగా ప్రసిద్ధి చెందింది. కొండకు తరలివచ్చే భారీ విద్యుత్ ప్రభలను తిలకించేందుకు ప్రత్యేకంగా భక్తులు తరలివచ్చి సంబరపడతారంటే ఆశ్చర్యం కాదు. కొండపై కొలువైన కోటయ్యస్వామి కిందకు దిగి రావాలంటే కోటిన్నొక్క ప్రభ నిర్మించాలని స్థల పురాణం చెపుతున్నది. అందుకే తిరునాళ్లకు అధిక సంఖ్యలో ప్రభలను భక్తులు నిర్మించి తీసుకొస్తారు. మహాశివ రాత్రికి భక్తులు కొండలో జాగరణ చేస్తారు. తెల్లవార్లు ప్రభల వెలుగులు ఒకవైపు, మరోవైపు ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులు జాగరణ పూర్తి చేస్తారు. ఒక్కో ప్రభ 90 అడుగులకుపైగా ఎత్తులో రూపు దిద్దుకుంటుంది. ప్రభల వ్యయం రూ.కోట్లల్లో ఉంటుంది. ప్రభలపై రంగు రంగుల లైట్లు, వీటిని వెలిగించే విధానం చూపరులను కట్టి పడేస్తుంది. భారీ విద్యుత్ ప్రభలతో పాటు సాధారణ ప్రభలను పెద్ద సంఖ్యలో భక్తులు కోటయ్యస్వామి సన్నిధికి తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు. విద్యుత్ ప్రభల వెలుగులు కళ్ళు మిరుమిట్లు గొలుపుతాయి. చిన్నారులు ప్రభలు కట్టుకుని చిలకలూరిపేట, నరసరావుపేట తదితర ప్రాంతాల నుంచి కాలి నడకన ఉత్సాహంగా కొండకు తరలివస్తారు. మొక్కుబడి ప్రభలతో నడిచి రాలేని వారు వాహనాలపై వీటిని అమర్చుకుని కొండకు తరలివస్తారు. ప్రభలపై సంగీత విభావరి, నృత్యాలు నిర్వహిస్తారు. గతంలో రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించే వారు. పోలీసు శాఖ వీటిని నిషేధించింది.

పెండ్లి కుమారుడిగా అమరేశ్వరుడు

- అమరావతిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమ య్యాయి. ఆలయ వంశపా రంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్ తరఫున స్వామివార్లకు పీసపాటి అమరేశ్వర శర్మ పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. అర్చకులు, వేదపండితులు మంగళవా యిద్యాలు, వేదమంత్రోశ్చరణల మధ్య అమరేశ్వరుడ్ని పెండ్లి కుమారుడిగా చేశారు. కార్యక్రమంలో ఈవో సునీల్‌కుమార్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


విద్యుత్ దీపాల కాంతిలో ప్రధాన రాజగోపురం

పెళ్లికుమార్తెగా కాకాని భ్రమరాంబ

పెదకాకాని, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమ య్యాయి. మాఘ ఆదివారం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అధిక సంఖ్యలో పొంగళ్లు తయారు చేసి స్వామి వారికి నివేదన చేశారు. మేళ తాళాల నడుమ ప్రభలతో ఆలయానికి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తొలిరోజు భ్రమరాంబ అమ్మవారు పెండ్లికుమార్తె అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాతసేవ, పంచహారతులు రుద్రాభిషేకం, విఘ్నేశ్వర పూజలతో ఉత్సవాలు ప్రారంభమ య్యాయి. ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోమవారం అమ్మవారు శ్రీవనదుర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తారని ఈవో తెలిపారు.


పెళ్లి కుమార్తెగా భమరాంబ అమ్మవారు

అమరావతి టవర్లు డయాగ్రిడ్ డిజైన్‌తో..

- నూతన సాంకేతికతతో భవనాల నిర్మాణం
- కరకట్టకు రెండు వైపులా రక్షణ గోడ
- నాలుగు లేన్ల రహదారికి తగ్గనున్న వ్యయం
- నీటి యాజమాన్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ
- అమరావతి నిర్మాణ పనులపై కీలక నిర్ణయాలు

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతికంగా అత్యాధునికమైన 'డయాగ్రిడ్' డిజైన్‌లో రాజధాని టవర్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ మంత్రి నారాయణ అధ్యక్షతన తాజాగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో రాజధాని నిర్మాణ పనులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కరకట్ట మీదగా రాజధాని నగరానికి నిర్మించే నాలుగు లేన్ల రహదారికి అయ్యే ఖర్చును అంచనా వేశారు. అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాలు, రాజధాని నగరానికి తాగునీరు, మురుగునీరు యాజమాన్య నిర్వహణపై సమగ్రంగా చర్చించారు. నీటి యాజమాన్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని తీర్మానించారు. రాజధాని పనులన్నీ సమగ్రంగా, సమాంతరంగా జరగడానికి అన్ని శాఖలు ఒక టీంలా పనిచేయాలని నిర్ణయించారు.

ముఖ్యమైన నిర్ణయాలు ఇవీ..

రాజధాని అమరావతికి ప్రస్తుతం ఇరుకుగా ఉన్న కృష్ణానది కరకట్ట మీదగా వెళ్లాలి. ఈ రోడ్డుపై ఎదురెదురుగా రెండు వరుసల్లో భారీ వాహనాలు వెళ్లే వీలు లేదు. అందువల్ల కరకట్ట మీదగా రాజధానికి విశాలమైన నాలుగు వరుసల రహదారి నిర్మాణం అత్యవసరంగా చేపట్టాలని, దీనికోసం కరకట్టకు ఇరువైపులా సిమెంట్ రిటైనింగ్‌వాల్‌ను నిర్మించాలని నిర్ణయించారు. రిటైనింగ్ వాల్‌ను నిర్మించకుండా బంకమట్టి వేసి దానిపై రహదారి నిర్మాణం చేపడితే.. రక్షణ లేకపోవడమే కాకుండా నిర్మాణ వ్యయం రూ.2,600 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. కరకట్టకు ఇరువైపులా సిమెంట్ రిటైనింగ్‌వాల్ నిర్మించి రహదారి వేస్తే రూ.1,800 కోట్లు అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు లెక్కలుగట్టారు. రక్షణ గోడలతో రహదారికి భద్రత ఉండటమే కాకుండా.. నిర్మాణ వ్యయమూ తగ్గుతుండటంతో ఈ విధానంలోనే రోడ్డు నిర్మించాలని తీర్మానించారు.

* రాజధాని నగరంలోని నిర్మాణాలను మున్సిపల్, ఇరిగేషన్, ఇంధన తదితర శాఖల సమన్వయంతో చేపట్టాలని నిర్ణయించారు.

* సంక్లిష్టమైన సాంకేతిక విధానాలతో కూడుకున్న భవన నిర్మాణాలకి స్టాండర్డ్ షెడ్యూల్డ్ రేట్(ఎస్ఎస్ఆర్) ఖరారు చేయడానికి సిఫార్సు చేయాలని తీర్మానించారు. డయాగ్రిడ్ డిజైన్‌లో నిర్మాణంలో వాడే స్టీల్ అత్యంత ఖరీదుతో కూడు కున్నది. ఫ్యాబ్రికేషన్, వెల్డింగ్‌ను కూడా అత్యాధునిక సాంకేతిక విధానంలో చేపట్టాల్సి ఉంటుంది. దీనికి నిపుణులైన పనివారు అవసరమవుతారు. వీరికి సాధారణ కూలీ లకంటే రెట్టింపు చెల్లించాలి. ఎస్ఎస్ ఆర్‌లో లేని దీనిని ఎస్ఎస్ఆర్‌లో చేర్చాల్సి ఉందని నిర్ణయించారు. భారీ నిర్మాణాల్లో అగ్ని నిరోధక విధానాలను అవలంభించాల్సి ఉంటుంది. అగ్ని నిరోధక విధానాలకు అత్యంత ప్రాధా న్యం ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

* రాజధాని మౌలిక వసతుల్లో అత్యంత ప్రధానమైనది తాగు, మురుగునీటి యాజమాన్య నిర్వహణ వ్యవస్థలు. వందేళ్లకు సరిపడా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని నిర్ణయించారు.

డయాగ్రిడ్ విధానం అంటే..

రాజధాని నగర నిర్మాణాలను సరికొత్తగా డయాగ్రిడ్ డిజైన్ విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో దీనిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. సాధారణంగా భవన నిర్మాణాల కోసం ముందుగా పునాదులు తవ్వి పిల్లర్లను వేసి శ్లాబ్ వేస్తారు. ఇలా అం తస్తుల మీద అంతస్తులు నిర్మిస్తారు. డయా గ్రిడ్.. అంటే డయాగ్నల్‌గా గ్రిడ్ రూపంలో ఉండే భవంతి డిజైన్‌లో ముందుగా మధ్యలో ఒకపెద్ద దిమ్మ తరహాలో నిటారుగా పిల్లర్‌ను పైకి లేపుతారు. పిల్లర్ చివరిలో శ్లాబులను వేసేందుకు అనువుగా కాంక్రీట్‌తో కూడిన సపోర్టును ఇస్తారు. వాటిని ఆధారంగా చేసుకుని శ్లాబులు వేస్తారు. అంటే.. సైకిల్ లేదా మో టారు సైకిల్ చక్రాన్ని పడుకోబెడితే.. మధ్య లోని హబ్ బేస్‌గా రిమ్‌కు ఊచలు కలిపి ఉండే తరహాలో డయాగ్రిడ్ డిజైన్ కూడా ఉంటుంది. ఐమూలగా అతికించిన ఐరన్, కలప లేదా కాంక్రీట్ బీమ్‌లతో ఒక్కో ఫ్లోర్ ను తీర్చిదిద్దుతారు. చుట్టు అద్దాలు అతికించి బిల్డింగ్‌ను నిర్మిస్తారు. సంప్రదాయ విధానం లో వాడే ఇనుము కన్నా డయాగ్రిడ్ విధా నంలో ఇనుమును త క్కు వ గా వినియోగి స్తారు.



నిర్లక్ష్యం.. ప్రాణాలు పణం



- రోడ్లపైకి భారీగా ఆటోలు, బైక్‌లు
- నిబంధనలు పట్టించుకోని వాహనదారులు
- పరిమితికి మించి ప్రయాణికులు.. ఓవర్ స్పీడ్
- ప్రమాదం జరిగినప్పుడే పోలీసు, రవాణాశాఖ హడావిడి
- మొక్కుబడిగా చేస్తున్న రహదారి భద్రత మాసోత్సవాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
ఓవర్‌లోడు.. ఓవర్ స్పీడు.. ఇదీ జిల్లాలో ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు. ఇరుకు రోడ్లపైన, రద్దీగా ఉండే రహదారుల్లోనూ ఆటోలు, బైక్‌ల విన్యాసాలతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. కళ్లెదుట నిండు ప్రాణాలు బలవుతున్నా.. వాహన చోదకులు నిర్లక్ష్యం వీడటంలేదు. మితిమిరిన వేగంతో వాహనాల్ని నడుపుతూ తమతో పాటు ఎదుటి వారి ప్రాణాలను కూడా తీస్తున్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించడం, ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించకపోవడంతో ప్రమాదాల్లో చనిపోతున్న వారి సంఖ్య అధికంగా ఉంటున్నది. అతి వేగం, నిర్లక్ష్యం, మద్యం తాగి వాహనాన్ని నడపడం, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్.. ఇలా కారణం ఏదైనా నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతుండగా వీటిలో అధికశాతం ద్విచక్రవాహనాల తర్వాత ఆటోలే ఉంటున్నాయి. నిత్యం ఏదో ఒక మూల ప్రమాదాల రూపంలో మృత్యుఘంటి కలు మోగుతూనే ఉన్నాయి. రోడ్డు ప్రమా దాలను నివారించడంలో పోలీసు శాఖ నిర్లక్ష్యంతోడు రవాణాశాఖ వైఫల్యం కొట్టొచ్చి నట్లు కనిపిస్తోంది. వాహన చోదకులకు కల్పించే అవగాహన కార్యక్రమాలు మొ క్కుబడి తంతుగా మారుతున్నాయనేందుకు తరచూ జరుగుతున్న ప్రమాదాలే నిదర్శనం. ఏటికేడు ఆటోల సంఖ్య పెరిగిపోతున్నది. వాటిని నడిపే వాళ్లు డ్రైవింగ్‌పై కనీస అవ గాహన లేకపోవడంతో పాటు నిద్ర, మద్యం మత్తు దారుణాలకు కారణమవుతోంది. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవ డం, ఈ క్రమంలో జాతీయ రహదారిపై పాటిం చాల్సిన నిబంధనలకు యధేచ్ఛగా పాతరేస్తున్నా పట్టించుకునే వారు లేరు. పరిమితికి మించి ప్రయాణికులకు ఆటోలు, ట్రాక్టర్లలో తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు. రోడ్డు భద్రతా వారోత్స వాలు పేరిట అధికారుల హడావిడే తప్ప వాటి వల్ల ఒనగూరుతున్న ప్రయోజనం గుండుసున్నా. గత నెల 16 నుంచి ఈనెల 15 వరకు 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. రవాణా, ఆర్టీసీ, పోలీసు, తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాలు జరి గాయి. అయితే ప్రారంభం రోజు మినహా మిగిలిన రోజుల్లో పెద్దగా అవగాహన, ప్రమాదాల నియం త్రణపై చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

73 ప్రమాదాలు.. 36 మృతులు

ఈ ఏడాది ఇప్పటి వరకు బాపట్ల జిల్లాలో 73 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. జనవరిలో 50, ఫిబ్రవరిలో ఇప్పటి వరకు 23 ఘటనలు నమోదయ్యాయి. 73 ప్రమాదాల్లో 36 మంది మృతి చెందగా, 82 మంది గాయాలపాలయ్యారు. వీటిలో అధికశాతం జాతీయ రహదారిపైనే జరగడం గమనార్హం. మార్టూరు మండలం డేగరమూడి సమీపంలోని జాతీయ రహదారిపై జనవరి 1న జరిగిన ప్రమాదంలో బైక్ మీద ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌ను వేగంగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. 2023 సెప్టెంబరులో సంతమాగులూరు వద్ద ఆటోని లారీ ఢీకొట్టడంతో ఐదుగురు చనిపోయారు. రోడ్డు ప్రమాదాలను గమనిస్తే బైక్‌లు, ఆటోలవే ఎక్కువగా ఉంటున్నాయి. జిల్లాలో ఎక్కువగా గ్రామీణ నేపథ్యం ఉండడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలపైనే ఎక్కువ మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో పరిమితికి మించి ఎక్కించుకోవడం, కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రమాదాలకు కారణాలుగా ఉంటున్నాయి.

బ్లాక్‌స్పాట్ల గుర్తింపుతో సరి..

తరుచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి బోర్డుల ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సర్వీస్ రోడ్డులో నుంచి హైవేపైకి వచ్చే సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బ్లాక్ స్పాట్‌లను గుర్తించే విషయంలో నిర్లక్ష్యం, ప్రమాదం జరిగి నప్పుడు హడావిడి తప్ప మూలాల్లోకి వెళ్లే ప్రయత్నమే చేయడం లేదు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని కట్టడి చేయడంలో పోలీసు, రవాణాశాఖల వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది. జరి మానాల కోసమే డ్రంకెన్ డ్రైవ్ అన్న అభిప్రాయం వాహన చోదకుల్లో స్థిరపడింది.

15 మంది సిబ్బందికి మెమోలు

- ప్రిన్సిపాల్‌పై శాఖాపరమైన చర్యలు
- సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ

రేపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న 15 మంది సిబ్బందికి మెమోలు జారీ చేశామనీ, ప్రిన్సిపాల్ గిరిజా కుమారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ వెల్లడించారు. ఆదివారం పట్టణంలోని 2వ వార్డులో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. వంట గదులు, మరుగుదొడ్ల పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ప్రిన్సిపాల్ గిరిజాకుమారి, ఉపాధ్యాయినుల మధ్య తరచూ విభేదాలు వస్తున్నాయనీ, వీటిని పరిష్కరించుకోవాలని ఆదేశించినా పట్టించుకోవడంలేదన్నారు. స్వయాన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి దగ్గర ఉండి మరుగుదొడ్లు శుభ్రం చేయించే పరిస్థితి ఉందంటే వీరి పనితీరు ఎలా ఉందో అర్థమౌతుందన్నారు. లక్షల జీతాలు తీసుకుంటున్నారే తప్పా బాధ్యతగా విధులు నిర్వహించటంలేదన్నారు. వీరి కారణంగా విద్యార్థులు బలైపోతున్నారన్నారు. ఆహార విషయంలో కూడా నాణ్యత పాటించటంలో విఫలం చెందారన్నారు. వీటన్నింటిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. మెమోలపై వివరణ ఇచ్చిన అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.


ప్రిన్సిపాల్ గిరిజాకుమారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీసీవో పద్మజ

వాగు ఆక్రమించి కంచె

- వైసీపీ నేత తీరుతో రైతులకు ఇబ్బంది
- ఫిర్యాదు చేయగా ప్రభుత్వ భూమిగా ఫ్లెక్సీ ఏర్పాటు
- కొన్ని నెలలుగా వైసీపీ, టీడీపీ నేతల మధ్య వివాదం
- మెరక మట్టిని తవ్వుతున్న ఉప్పుమాగులూరువాసులు

బల్లికురవ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో వైసీపీ నేత గత ప్రభుత్వ పాలనలో సర్వే నెంబరు 371లో సుమారు ఎకరం వాగు పోరంబోకు భూమిని ఆక్రమించుకున్నాడు. ఆ భూమి తన సొంతం అన్నట్లుగా మెరక మట్టి తోలి కంచె వేసుకుని ఎవరినీ రాకుండా అడ్డుకుంటున్నాడు. వాగు భూమిలో మెరక మట్టి ఉండడంతో పంటలకు నీరు రావడం లేదు. పైగా పొలాలకు రైతులు వెళ్లే దారి కూడా లేకుండా పోయింది. దీంతో అటు సాగునీరు, ఇటు పొలాలకు వెళ్లలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ వాగు భూమి అని, ఎవరైనా ఈ భూమిలోకి వస్తే శిక్షార్హులు అని బోర్డును ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల నుంచి గ్రామానికి చెందిన కొందరు రైతులు తమకు నీరు రావడం లేదని ప్రభుత్వ భూమిలో ఉన్న మెరక మట్టిని తవ్వి గ్రామంలోని అంతర్గత రోడ్లకు తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసిన వైసీపీ నేత అ భూమి తనదని వారితో వాదనకు దిగారు. దీంతో ఆదివారం గ్రామంలో టీడీపీ, వైసీపీ నేతల మధ్య వివాదం జరిగింది. ఈ భూమి విషయంపై రానున్న రోజుల్లో అధికారులు ఎలా చేస్తారో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. గతంలో వాగు పోరంబోకు భూమిని ఆక్రమించిన సమయంలో అప్పటి రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడం వల్లే ఇప్పుడు వివాదం నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు.


ఉప్పుమాగులూరులో వాగు పోరంబోకు భూమి ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసిన వైసీపీ నేత

నిరుపేదల పాలిట శాపం.. జగనన్న ఇళ్లు

- టార్గెట్ కోసం కాంట్రాక్టర్ల ద్వారా నిర్మాణం
- పిచ్చుక గూళ్లను తలపిస్తున్న వైనం
- నివాసయోగ్యంగా లేక ఖాళీగా వదిలేసిన లబ్ధిదారులు
- ఇప్పటికే హౌసింగ్ కింద నమోదు
- వేరే ప్రాంతంలో కట్టుకునే వీలు లేక సతమతం


అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డులో జగనన్న లేఅవుట్‌లో కాంట్రాక్టర్ నిర్మించిన ఇళ్లు

అద్దంకి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జగనన్న కాలనీలలో కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్ల నిర్మాణం చేయించుకున్న లబ్ధిదారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పుకునేందుకు, కేంద్ర నిధులు వినియోగించినట్లు చూపించుకునేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చి కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్ల నిర్మాణం చేయించారు. అయితే ఆ ఇళ్లు పిచ్చుక గూళ్లే మేలు అన్న విధంగా ఉండడంతో లబ్ధిదారులకు నివాసయోగ్యంగా లేకుండా పోయాయన్న విమర్శలు వస్తున్నాయి. అద్దంకి పట్టణంలో వైసీపీ హయాంలో సుమారు 2 వేల ఇళ్ల స్థలాలకు పట్టాలను లబ్ధిదారులకు ఇచ్చారు. వాటిలో 715 మంది ఇంటి నిర్మాణాలను సొంతంగా చేసుకోలేమని చెప్పడంతో ముగ్గురు కాంట్రాక్టర్ల ద్వారా నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం నుంచి వచ్చే రూ.1.80లక్షలతోనే ఇంటి నిర్మాణం చేయాల్సి రావడంతో చిన్న సైజ్‌లో కనీసం ఆ ఇంటిలో ఉండేందుకు వీలులేని విధంగా నిర్మాణాలు చేశారు. 170 ఇళ్లు పూర్తి కాగా మిగిలినవి ఇంకా నిర్మాణం లోనే ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సదరు కాంట్రాక్టర్లు కూడా నిర్మాణ పనులు మందకొడిగా చేస్తున్నారు. అయితే నిర్మాణం పూర్తయిన ఇళ్లు కూడా నివాసయోగ్యంగా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అప్పట్లో ప్రభుత్వం నుంచి మంజూరైన ఇంటి స్థలం రద్దు అవుతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బుతో కాంట్రాక్టర్ ద్వారా ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులు ఒప్పుకున్నారు. అయితే హౌసింగ్ లబ్ధిదారులుగా పేర్లు నమోదు కావడంతో భవిష్యత్‌లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కూడా అనర్హులు అయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. చిన్న ఇల్లు కావడం, నాణ్యత కూడా అంతంత మాత్రంగా ఉండడంతో లబ్ధిదారులు ఆయా ఇళ్లల్లో ఉండేందుకు ఇష్టపడకుండా అద్దె ఇళ్లల్లోనే నివాసం ఉంటున్నారు. రెండింటికీ చెడ్డ రేవడిలా పరిస్థితి తయారైందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అప్పట్లో హౌసింగ్ లబ్ధిదారులుగా నమోదు కాకుండా ఉంటే ప్రస్తుతం ఇళ్ల నిర్మాణానికి అవకాశం ఉండేదన్న అభిప్రాయాన్ని పలువురు లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పాల్గొన్న నిర్వాహకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వాడరేవు(చీరాల) ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం వాడరేవు రామానంద ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1200 మంది ప్రజలు హాజరయ్యారు. వారికి షుగరు, బీపీ పరీక్షలు చేశారు. ఈక్రమంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. హాజరైన వారికి ఆహార వసతిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యులు డా. రాజరాజేశ్వరి, డా.కమలా రాజేశ్వరి, డా. లలిత్ ప్రకాష్, డా. శ్రీకాంత్, డా.ప్రకాష్, ట్రస్టు మేనేజర్ నారాయణం సురేష్, ఉపాధ్యక్షుడు కృష్ణారావు పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు

చీరాల : చీరాల రోటరీ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు శంకర్ కంటి హాస్పిటల్స్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. రోటరీ సామాజిక భవనంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 200 మంది క్యాంపులో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. అలాగే వైద్య పరీక్షలు అనంతరం 15 మందికి శస్త్ర చికిత్స అవసరమున్న నేపథ్యంలో వారిని గుంటూరు శంకర్ కంటి హాస్పిటల్‌కు తరలించారు. ఈసందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రతినిధులు చందలూరి బాల వెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, హేమంత్‌కుమార్, మామిడాల శ్రీనివాసరావు, ప్రసాద్, ప్రతాప్, కుమార్, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, బాబు, సురేష్, నాగబాబు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చాలి

టీడీపీ పట్టణాధ్యక్షునికి సంఘ నేత వినతి


శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకి సంఘ అధ్యక్షుడు అరవింద్

అద్దంకి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఉమ్మడి 8 జిల్లాలలో ఉన్న వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చాలని కోరారు. ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశాలలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రస్తావించాలని అద్దంకి నియోజకవర్గ వాల్మీకి సంఘం అధ్యక్షుడు కుమ్మరపల్లి అరవింద్ ఆదివారం టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి 5 జిల్లాలలో ఇప్పటికే ఎస్టీలుగా ఉన్నారని, మిగిలిన 8 జిల్లాలలో బీసీలుగా ఉన్నారన్నారు. అందరినీ ఎస్టీలుగా చేర్చి న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం వద్ద చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

పర్చూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఈవోఆర్డీ కొననా సత్యనారాయణ అన్నారు. ఆదివారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపదను సృష్టించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎన్టీఆర్ క్రీడా ప్రాంతంలో రోడ్లపై పారవేసిన చెత్తను క్రేన్ సహాయంతో తొలగించే కార్యక్రమం చేపట్టారు.

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవం


శాంతి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చినగంజాం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతరావూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీకేశవస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు దిట్టకవి నరసింహాచార్యులు బ్రహ్మోత్సవంలో భాగంగా స్వామి వారికి ఉదయం అభిషేకాల కార్యక్రమాలను నిర్వహించి, తదనంతరం స్వామివార్ల విశేషంగా అలంకరించి, వేశేష పూజలు జరిపారు. రాత్రికి దేవస్థానం ప్రాంగణంలో స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలతో, పలు రకాల పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి, వేదపండితులు పార్థసారిథి వేదమంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా దంపతులచే శాంతి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణం స్వామి వారి నామస్మరణతో మారుమోగింది. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో పోతిన శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకురాలు యార్లగడ్డ లక్ష్మి, గోవిందు సుబ్బారావు, అర్లమండ్ల సుబ్బారావు, తోటకూర సుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు.

సీతారామ, లక్ష్మణ, హనుమ విగ్రహాల నిమజ్జనం


స్వామివారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

చినగంజాం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పురాతన సీతారామాలయంలోని సీతారామ, లక్ష్మణ, హనుమత్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వందేళ్ల నాటి సీతారామాలయంలో కొన్ని సంవత్సరాలుగా దీప, ధూప, నైవేద్యాలు లేక ఆలయం శిథిలావస్థకు చేరింది. నూతన ఆలయం నిర్మించేందుకు గత రెండు రోజుల నుంచి పురాతన ఆలయాన్ని కూల్చే పనులను ఆలయ కమిటీ సభ్యులు చేపట్టారు. ఆలయంలోని విగ్రహాలను విశేషంగా అలంకరించి గ్రామ పురవీధులలో మేళతాళాలతో ఊరేగింపు చేసి పల్లెపాలెం తీరప్రాంతంలోని గంగమ్మ ఒడికి భక్తులు సీతారామ లక్ష్మణ, హనుమత్ విగ్రహాలను చేర్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభులు వలివేటి వెంకటరామానుజం, మోటుమర్రి రామసుబ్బారావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


జూనియర్ సుబ్బారావును సత్కరిస్తున్న ప్రతినిధులు

కళలతో స్నేహభావం

చీరాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కళలతో కళాకారులు ఎందరికో దగ్గరై స్నేహభావం పెంపొందుతుందని జూనియర్ డీవీ సుబ్బారావు అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలో ఆయన తాత డీవీ సుబ్బారావు రంగస్థల వేదికలపై సత్య హరిశ్చంద్ర పాత్ర పోషించి మన్ననలు పొందారని గుర్తు చేశారు. ఈక్రమంలోనే జూనియర్ సుబ్బారావు తాత అడుగు జాడల్లో కళలు పోషిస్తున్నట్లు వివరించారు. అలాగే సత్యహరిశ్చంద్ర పాత్ర పోషించి అందరినీ అలరించారు. అనంతరం నిర్వాహకులు అతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అత్తులూరి రామారావు, గాదె హరిహరరావు, మువ్వల శివప్రసాద్, దామర్ల బాపయ్య, రామయ్య, నాగభూషణం, లోహియా పాల్గొన్నారు.


ప్రతిభామూర్తుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సభ్యులు

ప్రతిభతో గుర్తుండిపోతారు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సినీ నటులు తమ నటనతో, కవులు సాహిత్యంతో ప్రజల మనస్సులో ఎప్పటికీ గుర్తుండిపోతారని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అద్దంకి ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ప్రతిభామూర్తులు, మధుర స్మృతులు కార్యక్రమం ఎస్‌కే మస్తాన్ అధ్యక్షతన జరిగింది. ముందుగా ప్రతిభామూర్తులు సినీ నటుడు రాజబాబు, కవి మల్లవరపు జాన్, కళాకారుడు చీమకుర్తి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజబాబు సినీ జీవిత విశేషాలను ఉపాధ్యాయులు అక్కరాజు శ్రీనివాసరావు, మధుర కవి మల్లవరపు జాన్ సాహిత్య విశేషాలను నిమ్మరాజు నాగేశ్వరరావు సభలో వివరించారు. కార్యక్రమంలో ఏపీజీబీ అద్దంకి బ్రాంచి మేనేజర్ ఇట్టా వెంకటేశ్వర్లు, సంఘ అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య, ఎం.త్రిమూర్తులు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, మిట్టా కామేశ్వరశర్మ, రఘురామశర్మ, లేవి ప్రసాద్, శ్రీనివాసరావు, ఆర్‌వి రాఘరావు, నారాయణరావు పాల్గొన్నారు.

పరస్పర కేసులు నమోదు

మార్టూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలో తోడికోడళ్లు తాళ్లూరి తులసి, తాళ్లూరి ఉమామహేశ్వరి కుటుంబం గొడవలపై పరస్పరం స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

బాలికల హాస్టల్ పరిసరాలపై ప్రత్యేక శ్రద్ధ

- దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి
- సీఐ సుబ్బరాజు


బీసీ బాలికల వసతి గృహాల విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బాలికల వసతి గృహాల పరిసరాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని టౌన్ సీఐ సుబ్బరాజు అన్నారు. పట్టణంలోని బీసీ బాలికల, కళాశాల విద్యార్థినిల వసతి గృహాలను సీఐ సుబ్బరాజు ఆదివారం పరిశీలించారు. వసతి గృహాల హెచ్‌డబ్ల్యూవోలకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా రెండు వసతిగృహాలు ఒకే ప్రాంగణంలో ఉన్నందున పరిసరాలలో ఎలాంటి పొదలు లేకుండా తొల గింప చేయాలన్నారు. రాత్రి సమయాలలో పరిసరాలలో కూడా వెలుతురు ఉండేలా లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా బాలికల రక్షణ కోసం వసతిగృహం వద్ద దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాల వద్ద, శింగరకొండ సమీపంలోని బాలికల గురుకుల కళాశాల, హైస్కూల్ వద్ద రాత్రి సమయాలలో పోలీస్‌ల గస్తీని ఏర్పాటు చేస్తామని సీఐ తెలిపారు. హెచ్‌డబ్ల్యూవోలు పద్మావతి, సుమలత పాల్గొన్నారు.


నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కొండయ్య

టీడీపీకి పెరుగుతున్న ప్రజాదరణ

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో టీడీపీ దిన దినాభివృద్ధి చెందుతుందని, ప్రజాదరణతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో 31, 32 వార్డులతో పాటు మండల పరిధిలోని తోటవారి పాలెం దండయ్య కాలనీకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. దీంతో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. నియోజకవర్గంలో ప్రతి ప్రాంతానికీ సంక్షేమాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందజేస్తామని చెప్పారు. పార్టీలో చేరికలతో నూతన ఉత్సాహం కలుగుతుందని చెప్పారు. స్వేచ్ఛ వాతావరణాన్ని ప్రజలకు అందించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడిలో అన్నదానం

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి గ్రామంలో బస్‌షెల్టర్ వద్ద ఆదివారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని జనసేన పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని యద్దనపూడి మండల అధ్యక్షుడు గనిపిశెట్టి అయ్యప్ప ప్రారంభించారు. కార్యక్రమంలో యద్దనపూడి మండల టీడీపీ అధ్యక్షుడు నల్లపనేని రంగయ్యచౌదరి, గ్రామ అధ్యక్షుడు కనపర్తి నాగేశ్వరరావు, కే వెంకటేష్‌రావు, రామిశెట్టి శ్రీధర్, పఠాన్ అహమ్మద్, బొల్లా కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

మరణానంతరం దేహాన్ని దానం చేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సమాజ ప్రయోజనాల కోసం మరణానంతరం దేహాన్ని దానం చేయాలని ఒంగోలు ఆరోగ్య విస్తరణాధికారి డాక్టర్ జీ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అద్దంకిలోని కేర్ అండ్ క్యూర్ హోమియో క్లినిక్ ఆవరణంలో అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావుతో పాటు ఒంగోలు బొమ్మరిల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి పి.రాజ్యలక్ష్మి, ఒంగోలు జనవిజ్ఞాన వేదిక బాధ్యులు ఎస్వీ రంగారెడ్డి, అద్దంకికి చెందిన రాచమల్లు శివాంజనేయులు, సీహెచ్.శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అవయవ దానంపట్ల ప్రజల్లో ఉన్న అపోహలను ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా తొలగించాన్నారు. మరణానంతరం పార్థీవదేహాన్ని ఈ సమాజానికి ఉపయోగకరంగా ఉండేలా దానం చేయాలని దీనిపై ప్రజలందరికీ అవగాహన కల్పించి ఎక్కువ మందిని చైతన్య పరచాలన్నారు. అవదానంపై ఉన్న అపోహలను వీడేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని అందుకు ఆయా సంస్థలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది డి.గంగాధరరరావు, కాపూరి రఘుచంద్, ఎం.త్రిమూర్తులు, కేవీ రాజు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

1300 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రా-ధా-స్వ-ఆ-మీ సత్సంగం రాజుబంగారుపాలెం బ్రాంచి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచిత వైద్య శిబిరంలో కీళ్లు, ఎముకులు, చిన్నపిల్లల, మానసిక, సాధారణ, నరాల వైద్య నిపుణులు 15 మంది పాల్గొని పలు వ్యాధులకు సంబంధించిన 1300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు రాజుబంగారుపాలెం బ్రాంచి సత్సంగులు తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయవాడ, ఒంగోలు, చినగంజాంలకు చెందిన రాధాస్వామి సత్సంగులు పాల్గొన్నారు.

340 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మాధురి, వైద్యులు

పర్చూరు : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ హాస్పటల్ వైద్యులచే ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 340 మందికి పలు వైద్య పరీక్షలు చేశారు. రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ శిబిరాన్ని ప్రారంభించగా, ఎక్స్‌రే, ఈసీజీ తదితర పరీక్షలను చేశారు. గ్రామానికి చెందిన కోటా శ్రీనివాసరావు, ప్రసన్న దంపతులతోపాటు, తోకల కృష్ణమోహన్ సహకారం అందజేశారు. డాక్టర్ ప్రదీప్ నేతృత్వంలో డాక్టర్ వంశీ, గౌతం, పార్వతి, మాధురి, శ్రీధర్, జమీలా రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమట్ల ఆంజనేయులు, నాగభైరు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్‌రావు, శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, సత్యనారాయణ, రమేష్ చంద్ర, సదానందరెడ్డి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

మార్టూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని నాగండ్ల సుమిత్ర అనే వివాహిత మహిళ అదృశ్యంపై ఆమె తల్లి చిన్నలక్ష్మి ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సైదా తెలిపారు. మండలంలోని రాజుగారిపాలెంకు చెందిన సుమిత్రకు 2009 లోనే వివాహం జరిగింది. తర్వాత కొన్నికారణాలతో ఆమెకు మతిస్థిమితం లేకపోవడం తో రాజుగారిపాలెంలో పుట్టింట్లోనే తల్లి వద్ద ఉంటోంది. ఈనెల 15వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన సుమిత్ర కనబడలేదు. బంధువులు గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా రోటరీ ఆవిర్భావ దినోత్సవం

మార్టూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రోటరీ ఆవిర్భా దినోత్సవాన్ని ఆదివారం మార్టూరులో రోటరీ క్లబ్ వారు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్టూరులో జనార్దన్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్‌హారిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యాధికారి గారపాటి కిషోర్ కుమార్ కాలనీలోని పేదలకు ఉచితంగా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, గరిమిడి శ్రీనివాసరావు,రావి అంకమ్మచౌదరి, షేక్ కాజాహుస్సేన్, శివరావు పాల్గొన్నారు.



పురుషామృగ వాహనంపై భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వర స్వామి

పశుపతికి పురుషామృగ సేవ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమాలు జరిగాయి. అనంతరం చప్పర ఉత్సవం జరిగింది. పురుషామృగ వాహన సేవకు ఉభయకర్తలుగా డీ మోహన్, కస్తూరి దంపతులు, కాత్రా వెంకటకృష్ణమూర్తి ధర్మాదాయం నుం చి దేవస్థానం నిర్వహించాయి. కాగా, మూలస్థానేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆలయ ఈవో ర్వభూమి శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆహ్వానించారు. ఆలయ మర్యాదలతో మంత్రిని సత్కరించి ఆహ్వాన పత్రిక అందజేశారు.



నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న సీఎం చంద్రబాబు , చిత్రంలో టీడీపీ నేత బీద రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు

'బీద' వివాహ వేడుకలో సీఎం చంద్రబాబు

నెల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కుమారుడు వివాహ వేడుకకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఆదివారం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన బీద గోకుల రిష్వంత్-దివిజ వివాహానికి సీఎం విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముందుగా వారికి పుష్పగుచ్ఛం అందచేసి, కొద్దిసేపు ముచ్చటించారు. మధ్యాహ్నం 1.15 గంటలకు నెల్లూరుకు విచ్చేసిన చంద్రబాబుకు హెలిప్యాడ్ వద్ద మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఓ ఆనంద్, ఎస్పీ జీ కృష్ణకాంత్ ఇతర అధికారులు, టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన వీపీఆర్ కన్వెన్షన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎంపీ బీద మస్తాన్‌రావు, వారి కుటుంబ సభ్యులు సీఎంకు సాదర స్వాగతం పలికారు. సుమారు గంటపాటు బీద రవిచంద్ర కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్న సీఎం.. మధ్యాహ్నం 2:15 గంటలకు తిరుగుపయనమయ్యారు. ఈ వేడుకలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నెలవల విజయశ్రీ, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్, కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా రాష్ట్రంలోని నలుమూలల నుంచి పలువురు ప్రముఖులు బీద కుమారుడి వివాహ వేడుకకు తరలివచ్చారు.

● ప్రశాంతంగా ముఖ్యమంత్రి పర్యటన

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): పటిష్ఠ బందోబస్తు మధ్య ప్రశాంతంగా సీఎం చంద్రబాబు పర్యటన ముగిసిందని ఎస్పీ జీ. కృష్ణకాంత్ పేర్కొన్నారు.సీఎం పర్యటన ప్రశాంతంగా జరిగేందుకు సమయ పాలనతో బందోబస్తు నిర్వహించిన హోంగార్డు నుంచి అధికారుల వరకు ప్రతి ఒక్కరికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. సహకరించిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అన్నీ విభాగాల అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలని ఎస్పీ తెలిపారు.





సీఎం నారా చంద్రబాబు నాయుడుకు అభివాదం చేస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, పక్కన రాజ్యసభ సభ్యుడు బీఎంఆర్, కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పీ కృష్ణయ్య

క్వార్ట్జ్ అక్రమార్కులపై కొరడా

- ఎట్టకేలకు కేసు నమోదు
- రుస్తుం మైన్స్‌లో తవ్వకాలపై గనుల శాఖ డీడీ ఫిర్యాదు
- ఏడాది తర్వాత చర్యలకు అధికారుల సన్నద్ధం
- వైసీపీ నేతలు పేర్నాటి, మరికొందరిపై అభియోగాలు
- మిగిలిన అక్రమార్కుల పరిస్థితేమిటో...?

నెల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దోపిడీ అంటే ఎలా ఉంటుంది... అందులోనూ క్వార్ట్జ్ దోపిడీ ఎలా చేయవచ్చు.... అనేది వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరూపణ అయింది. వందలు, వేలు దాటి లక్షల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను గత ప్రభుత్వంలో కొల్లగొట్టారు. ఈ విషయం మైనింగ్‌శాఖ విచారణలో తేటతెల్లమైంది. ఏకంగా 25 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా క్వార్ట్జ్‌ను అక్రమ మార్గంలో దేశం దాటించినట్లు నిర్ధారించారు. ఇందుకు గానూ ఏకంగా రూ.267 కోట్లకుపైగా జరిమానాలు విధించడం దేశావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే నాడు అంత పెద్ద స్థాయిలో అక్రమాలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆఖరుకు విచారణలో అక్రమాలు బట్టబయలైనా ఒక్కకేసంటే ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు.

● అక్రమాలపై దృష్టి

అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్వార్ట్జ్ అక్రమాలపై దృష్టి పెట్టింది. నాడు బరితెగించి ప్రజాసంపదను కొల్లగొట్టిన అక్రమార్కులపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా తొలుత రుస్తుం మైన్స్‌లోకి అక్రమంగా చొరబడి క్వార్ట్జ్‌ను తరలించిన వైసీపీ నేతలపై మైనింగ్ డీడీ కేసు నమోదు చేశారు. పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 697, 699, 751/2, 759/1, 759/2, 924, 925లలోని ప్రభుత్వ భూముల్లో 2023 డిసెంబరు 15కా ముందు అక్రమంగా క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్‌ను తవ్వి తరలించుకు వెళ్లారని మైనింగ్ డీడీ బాలాజీ నాయక్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీకి చెందిన నాయకులు పేర్నాటి శ్యామ ప్రసాద్‌రెడ్డి, వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డిలు ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ మేరకు పొదలకూరు స్టేషన్‌లో సెక్షన్లు 447, 427, 379 రెడ్‌విత్ 34 ఐసీపీ, 3 పీడీపీపీఏ, 21(1), 21(4) ఎంఎండీఏఆర్‌పీ సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రభుత్వ భూముల్లో భారీ ఎత్తున వెలికితీసిన క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ ఖనిజాలను చెన్నై పోర్టు మీదుగా చైనాకు తరలించినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న తెల్లరాయి

● మిగిలిన వారి పరిస్థితేమిటి..?


వైసీపీ ప్రభుత్వంలో క్వార్ట్జ్ దోపిడీ ఎలా జరిగిందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎన్నికలకు ముందు రెండేళ్లపాటు విచ్చలవిడిగా జాతిసంపద చైనాకు తరలిపోయింది. నాడు ఎన్ని ఫిర్యాదులు చేసినా.. ప్రజలు ఆందోళనలు చేసినా పట్టించుకున్న నాథుడే లేడు. నాటి ప్రతిపక్ష టీడీపీ నేతలు అక్రమ మైనింగ్ జరిగే ప్రాంతాలకు వెళ్లి ఆందోళనలు చేసినా, ప్రభుత్వం స్పందించలేదు. ఆఖరుకు అప్పట్లో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలను అడ్డుకోవడంతో పాటు వాహనాలను పట్టుకున్నారు. వాటిని ముందుకు కదలనీయకుండా సత్యాగ్రహ దీక్ష చేశారు. మూడు రోజుల పాటు ఈ దీక్ష కొనసాగితే ఒక్కరంటే ఒక్క అధికారి కూడా ఆ దరిదాపులకు వెళ్లే సాహసం చేయలేకపోయారంటే నాటి పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు. చివరకు సోమిరెడ్డి దీక్షను అర్ధరాత్రి వేళ భగ్నం చేశారు తప్ప... ఆయన అడ్డుకున్న ఒక్క వాహనాన్ని కూడా సీజ్ చేయలేదు. ఇక చేసేది లేక కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి అక్కడి నుంచి సమాధానం ఇవ్వాలంటూ అడిగితే గానీ, పొదలకూరు మండలంలో క్వార్ట్జ్ దోపిడీ ఆగలేదు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎన్నికలకు ముందు క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై విచారణ జరిగింది. ఏడు జిల్లాలకు చెందిన మైనింగ్ అధికారులను జిల్లాలో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై విచారణకు నియమించారు. వారు నెల పాటు సర్వే చేసి జిల్లాలో 25.50 లక్షల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్ అక్రమంగా తరలినట్లు నిర్ధారించారు. ఇందుకు సంబంధించి 286 కేసులను నమోదు చేశారు. అందుకు గానూ అక్రమార్కులకు రూ.267.13 కోట్లు పెనాల్టీ విధించారు. ఇలా పెనాల్టీలు విధించిన వారిలో మెజారిటీ భాగం వైసీపీకి చెందిన వ్యక్తులే. అయితే తాజాగా రుస్తుం మైన్స్‌లో అక్రమ తవ్వకాలపై కేసులు పెట్టిన మైనింగ్ అధికారులు.. మిగిలిన అక్రమ మైనింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది. నాటి విచారణ నివేదికల ప్రకారం జిల్లాలో 286 చోట్ల అక్రమ మైనింగ్ జరగ్గా.. అందుకు పాల్పడిన వారందరిపైనా కేసులు నమోదు చేయాల్సి ఉంది. కాగా తాజాగా మైనింగ్ డీడీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొదలకూరు పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన కేసు వివరాలను చెప్పేందుకు కూడా పోలీసులు జంకుతుండడం గమనార్హం.

గ్రూప్-2 పరీక్షలకు 93 శాతం హాజరు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు 93 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 3548మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 3546 మంది హాజరయ్యారు. రెండు సెషన్స్‌లో హాజరు శాతం 93శాతంగా ఉంది. అయితే ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్‌కు 4102 మంది క్వాలిఫై కాగా, హాల్‌టికెట్లను 3815 మంది మాత్ర మే డౌన్‌లోడ్ చేసుకోవడం గమనార్హం. కాగా ఏడు కేంద్రాలను లైజనింగ్ ఆఫీసర్, కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తనిఖీ చేశారు.



నగరంలోని వీఆర్ పీజీ సెంటర్‌లో అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న అధికారులు



దివ్యాంగుడిని పరీక్ష హాలులోకి మోసుకు వెళ్తున్న పోలీసులు

కాసుల కోసం.. విప్పాలి గళం !

- నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- నిధుల కోసం సాగునీటి ప్రాజెక్టుల ఎదురుచూపులు
- అసంపూర్తిగా అభివృద్ధి పనులు
- ఆశలన్నీ శాసనసభ్యులపైనే...

నెల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు సోమవారం (నేటి) నుంచి ప్రారంభం కానున్నాయి. గత ఏడాది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌తో ముగిసింది. దీంతో ప్రాజెక్టులకు నిర్ధిష్ట కేటాయింపులు జరగలేదు. అయితే ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ నిధులు ఎమ్మెల్యేలు సాధించాలని కోరుతున్నారు. ప్రధానంగా పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి నిధులు రాబట్టాల్సిన బాధ్యత వారిపై ఉంది. మరి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళం విప్పుతారా..? వారివారి ప్రాంతాలకు ఏ మేరకు నిధులు సాధిస్తారు..? అన్నది ఆసక్తిగా మారింది.

● ఆత్మకూరు నియోజకవర్గంలో సోమశిల ఆప్రాన్ పనులు కూటమి ప్రభుత్వంలో మొదలయ్యాయి. కొంత వేగంగా జరిగినా ఆ తర్వాత వేగం తగ్గింది. బిల్లుల సమస్యతోనే కాంట్రాక్టర్ పనులు చేయడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రానున్న బడ్జెట్‌లో సోమశిల ఆప్రాన్‌తోపాటు ప్రాజెక్టు మరమ్మతులకు అవసరమైన నిధులు సాధించాల్సి ఉంది. సోమశిల హైలెవల్ కెనాల్ పనులు కూడా మళ్లీ మొదలుపెట్టాల్సి ఉంది. ముఖ్యమైన రిజర్వాయర్లను ఈ మధ్యలో నిర్మించాల్సి ఉంది. వీటికి నిధులు సాధించడం అత్యవసరం.

● కోవూరు నియోజకవర్గంలో మలిదేవి డ్రెయిన్ ఆధునికీకరణ పనులు బిల్లుల సమస్యతో ఆగిపోయాయి. ఈ వర్క్‌కు రానున్న బడ్జెట్‌లో నిధులు రాబడితే పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు పనులు మొదలుపెట్టించవచ్చు. అలానే ముదివర్తి-ముదివర్తిపాలెం కాజ్ వే పనులు కూడా బిల్లుల సమస్యతో ముందు, వెనుక అన్నట్లు సాగుతున్నాయి. పూర్తి కావాలంటే ప్రస్తుత బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు జరపాలి.

● కావలి నియోజకవర్గంలో కేటీఎస్, డీఆర్-డీఎం కాలువలు, సీబీఆర్ బైపాస్ కెనాల్, చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఇవి పూర్తయితే చివరి ఆయకట్టు వరకూ నీరందించవచ్చు. అందుకు నిధులు అవసరం. అలానే కావలిలో తాగునీటి సమస్యపై కూడా ఎమ్మెల్యే గళం విప్పాలని స్థానికులు కోరుతున్నారు.

● నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి సర్వేపల్లి కాలువ లైనింగ్ పనుల పూర్తికి నిధులు సాధించాలి. అలాగే రెండోఫేజ్ పనులు కూడా చేపడితే నగరంలో కాలువ లైనింగ్ పూర్తవుతుంది. ఇకపోతే నగరంలో ఉన్న ప్రధాన డ్రెయిన్లను 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఆ తర్వాత పనులు ఆగిపోయాయి. మళ్లీ నిధులు సాధించి డ్రెయిన్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. అలానే నగరంలో అసంపూర్తిగా ఉన్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలను కూడా పూర్తి చేసేందుకు నిధులు తీసుకురావాలి. పొట్టేపాలెం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కూడా రానున్న బడ్జెట్‌లో కేటాయింపులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

● సర్వేపల్లి నియోజకవర్గంలో కీలకమైన బండేపల్లి-దేగపూడి కాలువ నిర్మాణ పనులను మళ్లీ పట్టాలెక్కించాలంటే నిధులు అవసరం. అలానే సోమశిల దక్షిణ కాలువ కొనసాగింపు పనులకు కూడా నిధులు కేటాయించాల్సి ఉంది. కనుపూరు కాలువ డీప్‌కట్ నిర్మాణం కూడా చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. ఈ పనికి కూడా నిధులు సాధించేలా సర్వేపల్లి, రూరల్ ఎమ్మెల్యేలు కృషి చేయాల్సి ఉంది.

● కందుకూరు నియోజకవర్గంలో రాళ్లపాడు ప్రాజెక్టు నిర్వహణకు నిధులు అవసరం. నిర్వహణ లేకపోవడంతో గతేడాది కుడి కాలువ గేటు విరిగిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం క్రస్టు గేట్లను ఆపరేట్ చేయడం కూడా కష్టంగా మారింది.



ఏప్రిల్ నుంచి భూగర్భ డ్రైనేజీ పనులు

- మిగిలిన తాగునీటి పైపులైన్లను పూర్తి చేస్తాం..
- పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడి

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో అపరిష్కృతంగా ఉన్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల పనులను ఏప్రిల్ నుంచి తిరిగి ప్రారంభించి, త్వరతిగతిన పూర్తిచేస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నగరంలోని మహబూబ్‌ఖాన్ పార్కులో ఆట వస్తువులు, జిమ్ పరికరాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో తాము 90 శాతం వరకు యూజీడీ, తాగునీటి పైపులైన్ల పనులను పూర్తి చేస్తే, వైసీపీ ప్రభుత్వం ఒక్కశాతం కూడా ముందుకు తీసుకెళ్లలేదని దుయ్యబట్టారు. హడ్కో నుంచి రూ. 165 కోట్లు నిధులు సమీకరిస్తున్నామని, వాటితో ఏప్రిల్ నుంచి పనులు మొదలుపెడతా మన్నారు. నెల్లూరులోని అన్నీ పార్కుల్లో రానున్న మూడు నెలల్లో జిమ్, ఆటవస్తువులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ప్రజల నుంచి రాబట్టిన నగదును, వారి అవసరాలకే ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు.



కలెక్టరేట్ సమీపంలోని మహబూబ్‌ఖాన్ పార్కులో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, తదితరులు

సంతపేటలోని గుంటబడిలో మూడున్నర ఎకరాల్లోని ఆట స్థలాన్ని ఆధునికీకరించి క్రీడలకు ఉపయోగ పడేలా పనులు చేయిస్తున్నామన్నారు. అనంతరం గుంటబడి, ఇతర ప్రాంతాల్లోని పార్కులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ టీ అనురాధ , టీడీపీ నాయ కులు విజేతరెడ్డి, మధు, శైలజ, విజయ భాస్క ర్‌రెడ్డి, నత్యనాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా మల్లేశ్వరస్వామికి

హంస వాహనసేవ


హంస వాహనంపై విహరిస్తున్న మల్లేశ్వరస్వామి

కావలి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరు రుద్రపాద క్షేత్రంలోని దుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామిని వారికి ఆదివారం హంస వాహన సేవలందించారు. శివాలయ ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో ఈ గ్రామోత్సవం జరిగింది. ఉదయం హోమం, బలిహరణ పల్లకీ సేవ, విశేష అభిషేకార్చనలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

●సంగం: మండలంలోని వంగల్లులో భీమేశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం తెల్లవారుజామున భీమేశ్వరస్వామి హంస వాహనసేవ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా శ్రీ కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలోని స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లను పూలతో అలకరించారు. ఆలయ పూజారి కిషోర్ కుమార్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఘనంగా పాలేటి గంగమ్మకు పొంగళ్లు


పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

సంగం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):స్థానిక పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న పాలేటి గంగమ్మ ఆలయంలో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం కుంకుమ పూజ నిర్వహించారు. పొంగళ్లు పొంగించి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రామలింగేశ్వరుడి ఉత్సవాలను జయప్రదం చేయండి


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన దుత్తలూరు సంజీవ శిఖరంపై ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కల్యాణోత్సవం, గ్రామోత్సవంతోపాటు భక్తుల సౌకర్యార్థం అన్నదాన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈపూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మంత్రి ఆనం రామనారాణరెడ్డి, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. కావున దుత్తలూరు మండలంతోపాటు పరిసర మండలాలకు చెందిన ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

టీడీపీ పాలనలో అవినీతికి ఆస్కారం లేదు

● ఎమ్మెల్యే కాకర్లను విమర్శిస్తే సహించం : టీడీపీ నేతల ఆగ్రహం


వింజమూరులో మాట్లాడుతున్న విజయరామిరెడ్డి, వరికుంటపాడులో టీడీపీ నేతలు...

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అవినీతి విలయ తాండవం చేసిందని, తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేదని, రాష్ట్ర గిరిజన కార్పోరేషన్ డైరెక్టర్ ఆవుల అరుణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం అన్నారు. ఆదివారం స్థానిక మాజీ సర్పంచు ఆంద్రా బాలగురవారెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్లపై కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ ఇన్‌చార్జి రాజగోపాల్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలకు ఏమాత్రం బెదిరేది లేదన్నారు. అనంతరం అలాంటి కథనాలు ప్రచురించిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొడుగులూరి మాలకొండ్రాయుడు, గండిపాళెం ప్రాజెక్టు ఛైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, మాజీ జడ్పీటీసీ భోగినేని శ్రీనివాసులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అరవ కార్తీక్, గుమ్మళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్లపై ఆరోపణలు అర్థరహితం : మాజీ ఎమ్మెల్యే కంభం

●వింజమూరు : ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం కంభం విజయరామిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నాయకులు గణపరం సుదర్శన్‌రెడ్డి, మంచాల శ్రీనివాసులునాయుడు, జనసేన మండల అధ్యక్షుడు బందారు సత్యనారాయణ, శ్రీనివాసులు, నాగిరెడ్డి, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

నిరాధార అభియోగాలు మోపితే సహించం : బిజ్జం

●కలిగిరి : తెలుగుదేశం నాయకులపై నిరాధార అభియోగాలు మోపితే సహించమని టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో రేషన్‌బియ్యం అమ్ముకొని పార్టీ సభ్యత్వాలు చేసుకున్నారని, అగ్రిగోల్డ్ పొలాల నరికివేతపై ఎమ్మెల్యేకు సంబంధం ఉందని ఓ ఛానెల్‌లో వచ్చిన వార్తలను వారు తీవ్రంగా ఖండించారు. నిరాధార వార్తలపై స్థానిక ఎస్ఐ ఉమాశంకర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నేతలు బీవీ రామారావు, చీమల తాతయ్య, నరసింహనా యుడు, గన్నమనేని శ్రీనివాసులు, ఊసా మాల్యాద్రి, వెంగపనాయుడు, మాధవ, స్వర్ణ కొండ య్య, నిశ్శంకర సురేష్, లెక్కల రాంబాబు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీల్లో 'టీఆర్ఆర్' విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో తొలిసారి నిర్వహించిన అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీల్లో కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పోటీల్లో ప్రథమస్థానంలో నిలవటమే కాకుండా ఏడుగురు క్రీడాకారులు యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈనెల 28నుంచి మార్చి 4వరకు తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో జరగనున్న అంతర్ యూనివర్సిటీ స్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.


ఎంపికైన క్రీడాకారులతో అధ్యాపకులు

పశువైద్యం గగనం

● సకాలంలో వైద్యసేవలు అందక మూగజీవాల మృత్యువాత


వరికుంటపాడులో అర్థంతరంగా నిలిచిన అదనపు గది నిర్మాణం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మెట్ట ప్రాంతంలో ఏళ్ల తరబడి పశువైద్యం గగనంలా మారుతోంది. వైద్యసేవలు సకాలంలో అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. వేసవి సమీపిస్తుండడంతో పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. ప్రధానంగా ఉదయగిరి, ఆత్మకూరు నియోజక వర్గాల్లో అధిక శాతం మంది గేదెలు, మూగజీవాలను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. పాడిరైతులు తమ జీవాలను కాపాడుకునేందుకు పడ రాని పాట్లు పడుతున్నారు. ఆఫీసు సబార్డినేటర్ నుంచి పశువైద్యాధికారి పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నాయి. దీంతో జీవాలను కాపాడు కోవాలనే ఆశతో వైద్యశాలలకు పరుగులు తీసిన రైతులకు నిరాశే మిగులుతోంది.

వెంటాడుతున్న వైద్యాధికారుల కొరత

నియోజకవర్గ కేంద్రంలోని ప్రాంతీయ వైద్యశాలలో సబార్డినేటర్ పోస్టు ఖాళీగా ఉంది. గండిపాళెంలో పశువైద్యాధికారి, సబార్డినేటర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో అక్కడ వెటర్నరీ అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వరికుంటపాడుతో పాటు దుత్తలూరు మండలం నర్రవాడ, నందిపాడుల్లో వైద్యాధికారి, జూనియర్ వెటర్నరీ అధికారుల పోస్టులు వెక్కిరిస్తూనే ఉన్నాయి. సీతారామపురం మండలం బసినేనిపల్లిలో, వింజమూరు మండలం తమిదపాడు, గుండెమడగల పశువైద్యశాలల్లోను వైద్యాధికారుల కొరత వెంటాడుతూనే ఉంది. అలాగే ఆత్మకూరు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి దాపురించింది. మర్రిపాడు మండలం అనంతసాగరం, తిక్కవరం, కంపసముద్రం వైద్యశాలల్లో పశువైద్యాధికారి పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు.

సమస్యల వలయంలో సిబ్బంది

కాగా, అరకొరగా ఉన్న సిబ్బంది సైతం సమస్యలతో సహవాసం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన వసతులు లేకపోవడం, శిథిలావస్థకు చేరిన ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తించడం సవాల్‌గా మారింది. ప్రధానంగా సీతారామపురం, బసినేనిపల్లి, కుర్రపల్లి, గండిపాళెంలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ఉద్యోగుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. వరికుంటపాడులో మరుగుదొడ్లతో పాటు ఏళ్ల తరబడి అర్థాంతరంగా నిలిచిన అదనపు గది పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోక నిరుపయోగంగానే దర్శనమిస్తోంది. దీంతో ఇరుకైన ఆ వైద్యశాల గదిలో విలువైన మందులను భద్రపర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మారుమూల ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న పశువైద్యాధికారి, సిబ్బంది పోస్టులను భర్తీచేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని పశుపోషకులు కోరుతున్నారు.

మండల సమావేశం రసాభాస


మండల సమావేశంలో ఎమ్మెల్సీ మాధవరావుతో టీడీపీ నేతల వాగ్వివాదం

లింగసముద్రం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో మండలంలో టీడీపీ నేతలకు బిల్లులు చెల్లించకుండా వైసీపీ నేతలు ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ఎంపీపీ పెన్నా కృష్ణయ్యలపై టీడీపీ నేతలు వాగ్వివాదానికి దిగారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ సంఘటన జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ మాధవరావు కూడా హాజరయ్యారు. మొదటగా ఎమ్మెల్సీ మాధవ రావు, ఎంపీపీ కృష్ణయ్యలు 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగిన జమా ఖర్చుల వివరాలను చెప్పాలని ఎంపీడీఓ శ్రీనివాసులను ప్రశించారు. జమా ఖర్చుల వివరాలు లేకుండా సభను ఎలా నడుపుతారని మండిపడ్డారు. దీంతో సమావేశం బయట ఉన్న పలువురు టీడీపీ నేతలు సమావేశం జరిగే హాలులోకి వచ్చి గత నాలుగేళ్లలో చెప్పని జమా ఖర్చులు ఇప్పుడు అడగడం ఏమిటని, అలాగే అధికారులను బెదిరంచడంపై వారు ఎమ్మెల్సీ, ఎంపీపీలను నిలదీశారు. గతంలో జరిగిన పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతున్నందున బిల్లులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు. చేపట్టనున్న పనులకు ఎంపీపీ కృష్ణయ్య తీర్మానాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొందరు టీడీపీ నేతలు మీరు ఈ సభలో సభ్యులు కాదు కదా, మీకు ఆహ్వా నం లేకుండా ఎలా సభకు వస్తారని మాధవరావును ప్రశ్నించారు. తాను ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్సీ అని తాను సమాశేంలో పాల్గొనే హక్కు ఉందన్నారు. ఈ సందర్భంగా మాధవరావుకు టీడీపీ నేతలకు తీవ్రస్థాయిలో వాదనలు జరిగాయి. అధికారులు చేసేదిలేక సమావేశాన్ని అర్థాంతరంగా ముగించేశారు.

కాగా, మండల సమావేశం అనంతరం రాత్రి 7గంటల సమయంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య చాంబర్‌లో ఎమ్మెల్సీ మాధవరావు విలేకరులతో మాట్లాడారు. తాను ఎప్పుడూ అభివృద్ధికి అడ్డుపడే వ్యక్తిని కాదని, మండలాభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో టీడీపీ నేతలు బొల్లినేని నాగేశ్వరరావు, వంకాయలపాటి మాల్యాద్రిలు విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధికి నిధులు కేటాయిస్తే, గతంలో వైసీపీ నేతలు చేసిన పనులకు నిధులను ఇవ్వాలని అడగడాన్ని వారు తప్పుపట్టారు.

పారిశుధ్యం మెరుగుకు కావలిలో సరికొత్త ప్రణాళిక

● డంపర్‌బిన్‌ల స్థానంలో ఇనుప గ్రిల్స్

● రోడ్లపై చెత్త నిల్వ ఉండి కంపుకొట్టకుండా చర్యలు


చెత్త డబ్బాలు పెట్టేందుకు సిద్ధం చేస్తున్న ఇనుపమెస్‌లు

కావలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎక్కడా రోడ్లపై చెత్త కనిపించకుండా ఉం దేందుకు మున్సిపల్ అధికారులు సరికొత్త ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణం లో ఇంటింటా సేకరించిన చెత్తను సమీపంలోని డంపర్‌బిన్‌లలో వేస్తున్నారు. ఆ డంపర్ బిన్ లను మున్సిపల్ కాంపాక్ట్ వాహనాలు వచ్చి తీసుకెళ్లేవి. అయితే ఆ డంపర్ బిన్‌లు సకాలంలో ఎత్తకెళ్లక పోయినా లేక అవినిండినా దాని చుట్టూ చెత్త నిల్వచేరి కంపుకొడుతున్నాయి. దీనికితోడు వ్యాపారులు, ప్రజలు ఇళ్లు, దుకాణాలకు వచ్చిన మున్సిపల్ కార్మికులకు చెత్త ఇవ్వకుండా చెత్తను తీసుకొచ్చి డంపర్‌బిన్‌ల వద్ద కింద పోస్తుండటంతో ఆ ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు డంపర్‌బిన్‌ల స్థానంలో ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో ఇంటింటా సేకరించిన చెత్తను డబ్బాల్లో ఉంచి ఆ డబ్బాలను ప్రధాన సెంటర్లలోని ఇనుగ్రిల్‌లో పెట్టి వాటిని పందులు, కుక్కలు లాగకుండా వాటికి తాళాలు వేస్తారు. మున్సిపల్ వాహనాలు వచ్చి ఆ డబ్బాలలో ఉన్న చెత్తను వాహనంలో పోసుకుని ఖాళీ డబ్బాలను తిరిగి అక్కడే ఉంచి తాళాలు వేస్తారు. ఇంటింటా చెత్తను సేకరించిన వారు చెత్త డబ్బాలను తిరిగి అక్కడ పెట్టి, ఖాళీ డబ్బాలను తీసుకెళతారు. ఇలా చేయటం వలన ఎక్కడ రోడ్లపై చెత్త కనిపించ కుండా చేయవచ్చేనే ఆలోచనకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రయోగాత్మకంగా తొలుత కావలి పట్టణంలోని 10వ వార్డులో శ్రీకారం చుట్టారు. అయితే ఈ ప్రయోగం మంచిదైనా దాన్ని అమలు చేయడంలో అధికారులు చిత్తశుద్ధి ఎలా ఉంటుందో ప్రజలు ఎంత వరకు సహకరిస్తారో వేచి చూడాల్సి ఉంది.

అనాథలను ఆదరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఫాతిమా

ఉదయగిరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జమాతే ఇస్లామీ హింద్ ఉదయగిరి శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధి మదరసాలో రంజాన్‌కు స్వాగతం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా బాధ్యురాలు ఫాతిమాకౌసర్‌హుమైరవి, ఫాతిమా మహ్మద్‌లు మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్రమైనదని, ఆర్థిక స్తోమత కలిగిన వారు అనాథలను ఆదరించా లన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి శాఖ అధ్యక్షురాలు షేక్ అనియా, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో బుద్ధి వికాసం

వింజమూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మ జ్ఞానం కార్యక్రమం జరిగింది. ఇందులో హైదరా బాద్ మాస్టర్ శ్రీకాంత్ పాల్గొని ధ్యానంతో బుద్ధి వికసిస్తుందన్నారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈనెల 26వ తేదీ ఉదయం నుంచి 27 వరకు శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో అఖండ మౌన ధ్యానం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 70 మంది ధ్యానులతోపాటు శ్రీజ, హేమలత, లక్ష్మీ, స్వరాజ్యం, రాజేశ్వరి, జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మొక్కల పంపిణీ

సంగం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ ముత్యాల విజయ్‌చంద్ర ఆదివారం 20 మొక్కలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి పాఠశాలలో మొక్కలు నాటించారు. ఎన్ఆర్ఐను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు తదితరులు అభినందించారు.

క్రికెట్ మైదానం ఏర్పాటుకు కృషి

● కందుకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో క్రి కెట్ క్రీడాకారుల కోసం ప్రత్యే క మైదానం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉన్నత పాఠశాలల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కందుకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. టోర్నీ విజేతలకు రూ.లక్ష, రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు రూ.50వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు మస్తాన్, చిరంజీవి, రియాజ్, నాగరాజు, టీడీపీ నాయకులు చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, గొంది నరసింగరావు, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం


వెంగారెడ్డిపాళెంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి

సంగం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నట్లు ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ అధికారి నయీం తాజ్ హసన్ తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని వెంగారెడ్డిపాళెంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి తడి, పొడి చెత్త వేరు చేసి సంపద సృష్టించి పంచాయతీకి ఆదాయ వనరులు చేకూర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీయూ సీనియర్ నాయకుడి మృతి

● పలువురి సంతాపం

కందుకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ సీనియర్ నాయకుడు, ఇటీవల జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి పొందిన ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కాటా వెంకటేశ్వర్లు(59) ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

అంధకారంలో ముస్లిం కాలనీ

అనంతసాగరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక చినగుండం వీధిలో దీపాలు లేక ప్రజలు అంధకారంలో ఇబ్బందులు పడుతున్నారు. స్తంభాలకు ఎల్ఈడీలు వేయించాలని పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, ఇకనైనా అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచేందుకు కృషి

● ఏపీవో షేక్ సమీర్‌బాషా



ఈ తరహా

లింగసముద్రం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తామని మండల ఏపీఓ షేక్ సమీర్‌బాషా తెలిపారు. ప్రస్తుతం అన్ని పంచాయతీల్లో పనులు జరుగుతున్నట్లు చెప్పారు. కూలీలకు సరిపడా వేతనం వస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఏప్రిల్ నుంచి రైతులకు పండ్ల తోటలకు సంబంధించిన పనులు చేపడతామన్నారు.

? మండలంలో ఎంత మంది కూలీలు పని చేస్తున్నారు.

! ప్రస్తుతం 2వేల మంది వస్తున్నారు. కానీ రోజూ 5వేల మంది కూలీలు రావాల్సి ఉంది. అయితే వ్యవసాయ పనులకు ఎక్కువ మంది కూలీలు వెళుతున్నారు. రాబోయే రోజుల్లో కూలీల సంఖ్యను పెంచుతాం.

? రోజువారి కూలి వేతనం ఎంత వస్తుంది.

! రోజుకు సరాసరిన రూ.250 నుంచి రూ.300కూలి వేతనం వచ్చేలా పనులు చేయిస్తున్నాం. రోజులో 4నుంచి 5గంటలు పనిచేయాల్సి ఉంటుంది.

? ప్రస్తుతం ఎలాంటి పనులు చేస్తున్నారు.

! రైతులకు ఉపయోగపడే పంట కాలువల పూడికతీత, ఫారంపాండు పనులు చేయిస్తున్నాం. రాబోయే ఏప్రిల్‌లో రైతులకు ఉద్యానవన పంటలకు సంబందించిన పనులు చేపడతాం.

న్యూస్ బాక్స్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని సామాజికవేత్త మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రోజురోజుకు సమాజంలో వాయు, ధ్వని, జల కాలుష్యం పెరిగిపోతుందని దీనికి మనమే కారకులమన్నారు. అడవులను కాపాడుకోవడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని అదేవిధంగా గ్రామాల్లో, పట్టణాల్లో చెట్లను తొలగించడమే తప్ప మొక్కలు నాటే వారు కరువయ్యారని వా పోయారు. పట్టణాలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించుకొని ఆరోగ్యమైన సమాజంను నెలకొల్పి వ్యాధులకు దూరం కావాలన్నారు.

ఉచిత వైద్యశిబిరం

సంగం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంక్ సమీపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఎం శ్రావణ్ కుమార్, పి మణి మృధుల బీపీ, షుగర్, బీఎంఆర్, కీళ్ల వాతం పరీక్షలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బందితో పాటు నిర్వాహకులు వాసు, కోటారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

కావలిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్‌లోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలకు ఆదివారం శ్రీనివాస జూనియర్ కళాశాల నిర్వాహకులు 7కుర్చీలు వితరణగా ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు సయ్యద్ హయ్యాల్ హయ్యూమ్ మాట్లాడారు. పాఠశాలలో కుర్చీల కొరత ఉందని చేసిన విన్నపం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్యానికి హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో పారిశుధ్య కార్మికురాలికి గాయాలు

కందుకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పారిశుధ్య కార్మికురాలు జంగిలి రోశమ్మ ఆదివారం మార్కెట్ సెంటర్‌లో మినీ లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. సహచర కార్మికులు ఆమెను తక్షణం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ నాయకులు బి. సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు.

గిరిజన కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం

అనంతసాగరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభించారు. మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఉత్తర కాలువ ఛైర్మన్ కృష్ణారెడ్డికి సమస్యను సాగరం చెరువు సొసైటీ అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ బుజ్జమ్మ తెలపడంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 20 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఇంతియాజ్, నాయకులు అవినాష్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, ఖాసీంబాష తదితరులు పాల్గొన్నారు.